# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 203 శుక్రవారం 29 మార్చి 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## ఫలహారం పంచుకున్నది అందరూ....

# తప్పించుకొని తిరుగుతున్నది కొందరు!






- లక్కీ స్కీమ్ పేరిట ప్రజలను దోచుకున్న ప్రబుద్ధులు
- జర్నలిస్టులమంటూ ప్రజలకు పంగనామం
- మావి ప్రధాన పత్రికలు అంటూ ఇల్లీగల్ దండాలు
- లక్కీడ్రా నిర్వహిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించిన కోర్టు
- ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ఓ.. పత్రిక రిపోర్టర్ ప్రధాన సూత్రధారి
- పోలీసులకు పట్టుబడిన కూడా చాకచక్యంగా తప్పించుకున్న ప్రబుద్ధుడు
- సదరు పత్రికా యజమాన్యం పైన తీవ్ర విమర్శలు

-6లో

చెప్పేవి శ్రీరంగా నీతులు... చేసేవి నీచ పనులు.. అన్నట్లు కొందరు రిపోర్టర్లు అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. మావి పెద్ద పత్రికలు అంటూ లక్కీ లాటరీ పేరిట అమాయక ప్రజల నుంచి దోచుకున్న కొందరు జర్నలిస్టుల మాయ భాగోతపు పనులు బట్టబయలు కావడంతో ప్రజలు విస్తుపోతున్నారు. అవినీతి అక్రమాల గురించి పత్రికల్లో రాయాల్సిన జర్నలిస్టులు లక్కీ లాటరీ పేరిట జనాలకు కుచ్చు టోపి పెట్టడం "దయ్యాలు వేదాలు చదివినట్లుగా" ఉందని ప్రజలు మండిప డుతున్నారు. మూడేళ్ళ కిందట ఇచ్చోడ, బోథ్, సిరికొండ, నేరడిగొండ, బజార్ హత్నూర్ మండలాలకు చెందిన కొందరు దినపత్రిక రిపోర్టర్లు జర్నలిజం ముసుగులో అక్రమ మార్గంలో లక్షలు గడించడం కోసం బోథ్ కేంద్రంగా లక్కీ లాటరీ పేరిట అక్రమ దందాను నిర్వహించారు.



## కూటమి విచ్ఛిన్నం..

- ఒంటరిగానే జేజేపీ పోటీ
- "రాష్ట్రంలోని మొత్తం 10 స్థానాల్లో ఒంటరిగా పోటీ
- అభ్యర్థుల ఎంపికపై చర్చలు
- భారతీయ జనతా పార్టీ-జననాయక్ జనతా పార్టీ కూటమి విచ్ఛిన్నమైన కొన్ని రోజులలోనే జేజేపీ నుంచి ఒంటరి పోటీ నిర్ణయం

# కేకే పార్టీ జంప్!

- పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకున్న సీనియర్ నేత కేకే
- పార్టీ మారబోతున్న విషయం కేసీఆర్‌కు చెప్పిన కేశవరావు
- నీ కుటుంబానికి ఏం తక్కువ చేశాం..
- కే కేశవరావు నిర్ణయంపై కెసిఆర్ తీవ్ర అసహనం
- మరో సారి ఆలోచించుకోవాలని కేకేకు సూచించిన కేసిఆర్



సిద్దిపేట

ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో సంచలన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పార్టీ మారుతారనే ప్రచారం జోరుగా సాగుతున్న వేళ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ కేశవరావు మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన కేకే పార్టీ మార్పు ప్రచారంపై కేసీఆర్‌కు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లో ఉండలేనని కే. కేశవరావు చెప్పినట్టు సమాచారం. ఓ రకంగా ఇది కెసిఆర్‌కు మింగుడుపడని విషయం. పార్టీలో కేకేకు ఇచ్చిన ప్రాధాన్యత, పదవుల దృష్ట్యా కేకే శాశ్వతంగా ఉంటారని కెసిఆర్ భావించారు కానీ సీన్ రివర్స్ అయినట్టు తెలుస్తోంది. తన నిర్ణయంపై కెసిఆర్‌తో కొద్దిసేపు చర్చించిన కేకే.. తనకు ఈ పరిస్థితి -మిగతా3లో




# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- మరో ఇద్దరి అరెస్ట్
- మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎన్‌స్పెక్టర్ గట్టు మల్లు అరెస్ట్?
- వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతో రాధాకిషన్ గట్టుమల్లు కీలకపాత్ర వహించినట్లు సమాచారం
- మరో వైపు భుజంగరావు, తిరుపతన్నను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు
- ప్రణీత్‌కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది.

హైదరాబాద్

తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దర్ని.. పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలిస్ స్టేషన్‌లో ఆ ఇద్దర్నీ పోలీసు అధికారులు విచారిస్తున్నారు. కాగా ఈ ఇద్దరు కూడా పోలీసు అధికారులే కావడం గమనార్హం. బుధవారం రాత్రి అధికారులను అదుపులోనికి -మిగతా3లో

# హైదరాబాద్ ఎంపీగా సానియా మీర్జా పోటీ?!

న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు

- ఈ స్పోర్ట్స్ స్టార్ త్వరలోనే రాజకీయ రంగ ప్రవేశం చేయనుందనే వార్తలు
- హైదరాబాద్ లోక్‌సభ ఎంపీగా సానియా పోటీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కంచుకోటగా ఉన్న హైదరాబాద్
- కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం
- ఎంఐఎంకు పట్టున్న హైదరాబాద్ నియోజకవర్గంలో సానియా మీర్జాను పోటీకి నిలపడం ద్వారా ఒవైసీకి చెక్ పెట్టవచ్చనే యోచనలో కాంగ్రెస్



హైదరాబాద్

భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా గురించి ఆసక్తికర వార్త తెరమీదకు వచ్చింది. ఈ స్పోర్ట్స్ స్టార్ త్వరలోనే రాజకీయ రంగ ప్రవేశం చేయనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ లోక్‌సభ ఎంపీగా సానియా పోటీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆమెను బరిలోకి దించాలనే యోచనలో ఉన్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. కాగా లోక్ సభ ఎన్నికలకు నగారా మోగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కంచుకోటగా ఉన్న హైదరాబాద్‌లో.. బీజేపీ మాధవీ లతను పోటీకి దింపింది. అయితే, కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థి -మిగతా3లో

## ఉపాధి హామీ కూలీలకు గుడ్ న్యూస్..

# పెరిగిన రోజువారీ వేతనం

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 4 - 10 శాతం వరకు వేతనాలు పెంచిన కేంద్రం
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వేతన పెంపు రూ.28 నుంచి రూ.300కి రోజువారి కూలీ పెంపు



# ఉపాధి హామీ కూలీలకు గుడ్ న్యూస్..
# పెరిగిన రోజువారీ వేతనం

**ఢిల్లీ:** ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న ఉపాధి హామీ కూలీల వేతనాలు పెరిగాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ రాష్ట్రాలకుగానూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 4 - 10 శాతం వరకు వేతనాలు పెంచింది. వేతనాల సవరణలో భాగంగా ప్రభుత్వం పెంపుదలను ప్రతిపాదించింది. ఈ పథకం కింద నైపుణ్యం లేని కార్మికులకు హర్యానాలో అత్యధిక వేతనం రోజుకు రూ.374 అందనుండగా, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లలో అత్యల్పంగా రూ.234 వేతనం అందనుంది. సిక్కింలోని మూడు పంచాయితీలు గ్నాతంగ్, లాచుంగ్, లాచెన్ ప్రజలు రోజుకు సగటు వేతనం రూ. 374 వేతనం పొందనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత ఈ పథకం కింద వేతన సవరణను మార్చి 27న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. నైపుణ్యం లేని కార్మికులు వారు నివసిస్తున్న గ్రామంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధిని కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంపొందించే లక్ష్యం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. నోటిఫికేషన్ ప్రకారం.. గోవాలో వేతన పెంపు రేటు దేశంలోనే అత్యధికంగా రూ.34గా ఉంది. ప్రస్తుతం అక్కడ రోజువారీ కూలీ రూ.356 ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వేతన



పెంపు రూ.28గా ఉంది. ఇప్పుడు మొత్తం కూలీ రూ.300కి చేరింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో పెరుగుదల అత్యల్పంగా రూ.7గా ఉంది. రెండు రాష్ట్రాలలో పని చేసే కార్మికులు రోజుకు రూ.237 వేతనం అందుకోనున్నారు. తెలంగాణలో రూ.28 పెంచడంతో రోజువారీ కూలీ రూ.300కి చేరింది. పశ్చిమ బెంగాల్‌లో రూ.250 (రూ.13 పెరుగుదల), తమిళనాడులో రూ.319 (రూ.25 పెరుగుదల), బీహార్‌లో రూ.228 (రూ.17 పెరుగుదల)గా ఉంది. వేతన రేటు పరంగా హర్యానా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, పెరుగుదల కేవలం నాలుగు శాతంగానే ఉంది. మొత్తంమీద పెంపుదల 4 నుంచి 10 శాతం మధ్య ఉంది. తెలంగాణ, ఏపీ, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 10 శాతం పెరుగుదల నమోదైందని నోటిఫికేషన్ డేటా వెల్లడిస్తోంది.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ కేసులో రోజుకో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. నేటితో(మార్చి 28) కస్టడీ నేటితో ముగియడంతో గురువారం కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ హాజరుపర్చనుంది. కోర్టులో కేజ్రీవాల్ సొంతంగా వాదనలు వినిపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన పార్టీ(ఆప్)ని అణచివేసేందుకు ప్రయత్నిసోందని ఆరోపించారు. 100 కోట్ల అవినీతి జరిగిందని ఈడీ చెబుతోందని, మరి ఆ వందకోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. తన అరెస్ట్‌కు తగిన ఆధారాలు లేవని తెలిపారు. ఏ కోర్టు కూడా తనను దోషిగా పరిగణించలేదని పేర్కొన్నారు సీబీఐ 31 వేల పేజీల చార్జిషీట్‌లో, ఈడీ 25వేల పేజీల చార్జిషీట్‌లో ఎక్కడా తన పేరు లేదని పేర్కొన్నారు. అయినా తనను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. తనను ఇరికించడమే ఈడీ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. మాగుంట రాఘవరెడ్డి ఇచ్చి 7 స్టేట్‌మెంట్లలో ఆరు స్టేట్‌మెంట్లలో తన పేరు లేదని చెప్పారు. శరత్ చంద్రారెడ్డి అరెస్ట్ తర్వాత రూ. 55 కోట్లు ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి ఇచ్చాడని పేర్కొన్నారు. అతడితో బలవంతంగా నా పేరు చెప్పించారని ఆరోపించారు. ఈడీకే రెండే లక్ష్యాలు ఉన్నాయని.. ఒకటి నన్ను ఇరికిండం, రెండో ఆప్‌ను లేకుండా చేయడమని అన్నారు. కాగా కేజ్రీవాల్ ఈడీ కస్టడీపై సీబీఐ స్పెషల్ కోర్టులో వాదనలు ముగిశాయి. అయితే మరో ఏడు



రోజులపాటు కేజ్రీవాల్ కస్టడీ పొడిగించాలని ఈడీ కోరింది. ఇరు వాదనలు విన్న న్యాయస్థానం.. కేజ్రీవాల్ కస్టడీ పొడిగించింది. మరో నాలుగు రోజులు ఈడీ కస్టడీ పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో ఏప్రిల్ 1 వరకు కేజ్రీవాల్ కస్టడీలోనే ఉండనున్నారు.

**నన్ను అరెస్టు చేయడమే ఈడీ లక్ష్యం : కేజ్రీవాల్**

నిందితుడితో బలవంతంగా నా పేరు చెప్పించారు. నిందితుడు 55 కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్స్ బీజేపీకి ఇచ్చారు. ఏ కోర్టు నన్ను దోషిగా పరిగణించలేదు. నా అరెస్టుకు తగిన ఆధారాలు లేవు. ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతి పార్టీ అని చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. నా పార్టీని నిర్మూలించాలనుకుంటున్నారు. నా పేరు కేవలం నాలుగు సార్లు ప్రస్తావనకు వచ్చింది.

**ఈడీ వాదనలు:**

ఢిల్లీ మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్ 100 కోట్ల లంచం తీసుకున్నారు. ఆయన విచారణకు సహకరించడం లేదు. ఈడీకి అరెస్టు చేసే హక్కు ఉంది. శరత్ చంద్రారెడ్డి 50 కోట్ల రూపాయలు ఎలక్ట్రోలు బాండ్స్ రూపంలో బీజేపీకి ఇచ్చిన నిధులకు ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధం లేదు. ఇది క్విడ్ ప్రోకో కిందికి రాదు. ఆమ్ ఆద్మీ పార్టీ హవాలా డబ్బు ద్వారా గోవా ఎన్నికల్లో ఖర్చు చేసిన వివరాలు మా దగ్గర ఉన్నాయి. వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్ మా వద్ద ఉన్నాయి

కోర్టుకు తీసుకు వెళ్లే సమయంలో కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు

నా అరెస్ట్ రాజకీయ కుట్ర ఢిల్లీ ప్రజలే గట్టిగా సమాధానం చెబుతారు రౌస్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్‌ను హాజరుపర్చిన ఈడీ

ఇదిలా ఉండగా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీలాండరింగ్ అభియోగాలపై కేజ్రీవాల్‌ను మార్చి 21 ఆయన నివాసంలో ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మరుసటి రోజు ఆయన్ను ఈడీ రౌస్ అవెన్యూ కోర్టుకు హాజరుపరిచి కస్టడీకి కోరింది. దీంతో కోర్టు సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరు రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది.

## ఎలక్టోరల్ బాండ్లు ప్రపంచంలోనే పెద్ద కుంభకోణం: పరకాల ప్రభాకర్

**ఈ అంశం బీజేపీపై గణనీయమైన ప్రభావం చూపుతుందన్న ప్రభాకర్**

**రాబోయే రోజుల్లో ఇది పెద్ద సమస్యగా మారుతుందని వ్యాఖ్య**

**బీజేపీ ప్రభుత్వాన్ని ఓటర్లు కఠినంగా శిక్షిస్తారన్న ప్రభాకర్**



ఎలక్టోరల్ బాండ్స్ వ్యవహారం దేశ రాజకీయాల్లో కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఇది అతి పెద్ద కుంభకోణమని చెప్పారు. ఇది లోక్ సభ ఎన్నికల్లో బీజేపీపై గణనీయమైన ప్రభావాలను చూపే అవకాశం ఉందని అన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ ఇష్యూ రోజురోజుకూ పెరుగుతోందని... అదొక కుంభకోణమనే సంగతి ఇప్పుడు అందరికీ అర్థమవుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ఇష్యూ పెద్ద సమస్యగా మారుతుందని అన్నారు. ఈ అంశం కారణంగా బీజేపీ ప్రభుత్వాన్ని ఓటర్లు కఠినంగా శిక్షిస్తారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్టోరల్ బాండ్ల డేటాను అధికారిక వెబ్ సైట్లో ఉంచిన సంగతి తెలిసిందే. ఈ బాండ్ల ద్వారా బీజేపీకి అత్యంత ఎక్కువగా రూ. 6,986.5 కోట్లు వచ్చాయి. టీఎంసీకి రూ. 1,397 కోట్లు, కాంగ్రెస్ కు రూ. 1,334 కోట్లు, బీఆర్ఎస్ కు రూ. 1,322 కోట్లు వచ్చాయి. ఎలక్టోరల్ బాండ్లను తక్షణమే ఆపేయాలని ఎస్బీఐను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## భార్య కన్నా గడ్కరీ ఆదాయం తక్కువ..
# భూములు కూడా లేవు!

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరుపున ఎన్నికల బరిలోకి దిగిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో ఆయన తన ఆస్తిపాస్తుల వివరాలు తెలియజేశారు. ఆదాయం విషయంలో నితిన్ గడ్కరీ తన భార్య కంచన్ నితిన్ గడ్కరీ కంటే చాలా వెనుకబడివున్నారు. అఫిడవిట్‌లోని వివరాల ప్రకారం నితిన్ గడ్కరీ 2022-23లో రూ. 13,84,550 ఆదాయం సంపాదించారు. ఆయన భార్య కంచన్‌కు 2022-23లో రూ.40,62,140 ఆదాయం అందుకున్నారు. నితిన్ గడ్కరీ ఆస్తుల విలువ రూ. ఒక కోటీ 32 లక్షల 90 వేల 605. ఆయన భార్య కంచన్ ఆస్తుల విలువ రూ. ఒక కోటీ 24 లక్షల 86 వేల 441. నితిన్ గడ్కరీ కుటుంబానికి రూ.95,46,275 విలువైన చరాస్తులు ఉన్నాయి. గడ్కరీ పేరు మీద మూడు కార్లు ఉన్నాయి. వీటిలో అంబాసిడర్ కారు ఒకటి. 1994లో కొనుగోలు చేసిన ఈ కారు ధర రూ.10 వేలు. గడ్కరీ దగ్గర హోండా కంపెనీకి చెందిన కారు ఉంది. దీని ధర 6,75,000. గడ్కరీకి ఎల్‌సుజు కంపెనీకి చెందిన మరో కారు ఉంది. దాని విలువ రూ.12,55,000. నితిన్ గడ్కరీ భార్య కంచన్ పేరు మీద మూడు కార్లు ఉన్నాయి. అవి రూ.5,25,000 విలువైన ఇన్నోవా, రూ.4,10,000 విలువైన మహీంద్రా కంపెనీ కారు, రూ.7,19,843 విలువైన టాటా కంపెనీ కారు. బంగారం, ఆభరణాల విషయంలో భార్య కంచన్ కంటే



నితిన్ గడ్కరీ ముందున్నాడు. నితిన్ గడ్కరీ వద్ద రూ.31,88,409 విలువైన బంగారం లేదా ఆభరణాలు ఉన్నాయి. అదే సమయంలో కంచన్ వద్ద రూ.24,13,348 విలువైన ఆభరణాలు ఉన్నాయి. స్థిరాస్తుల విషయానికొస్తే నితిన్ గడ్కరీ పేరు మీద వ్యవసాయ భూమి లేదు. ముంబైలో అతని పేరు మీద ఓ ఇల్లు ఉంది. 960 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఇంటి ధర రూ.4.95 కోట్లు. కంచన్‌కు ఇల్లు, భూమి ఉన్నాయి. వీటి ధర రూ.7 కోట్ల 99 లక్షల 83 వేలు. నితిన్ గడ్కరీ కుటుంబానికి రూ.11 కోట్ల 55 లక్షల 11 వేల విలువైన స్థిరాస్తి ఉంది. నితిన్ గడ్కరీకి రూ. ఒక కోటీ 66 లక్షల 82 వేల 750 రుణం, ఆయన భార్య కంచన్‌కు రూ.38 లక్షల 8 వేల 390 రుణం ఉంది.

## మూడో బిడ్డకు తండ్రైన పంజాబ్ సీఎం.. కుమార్తె ఫోటో షేర్ చేసిన భగవంత్ మాన్

**చండీగఢ్:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ భార్య.. డాక్టర్ "గురుప్రీత్ కౌర్" గురువారం మొహాలీలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పండండి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని భగవంత్ స్వయంగా తన ఎక్స్ (ట్విటర్) ఖాతా ద్వారా వెల్లడించారు. దేవుడు ఒక కుమార్తెను బహుమతిగా ఇచ్చాడు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు అంటూ.. బిడ్డ ఫోటో కూడా షేర్ చేశారు. లూథియానాలోని ఫోర్టిస్ ఆసుపత్రిలో గురుప్రీత్‌కు ప్రసవం జరిగినట్లు తెలిసింది. ఈ వార్త తెలుసుకున్న నెటిజన్లు, అభిమానులు భగవంత్ మాన్ దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. పంజాబ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో పదవిలో ఉన్నప్పుడు తండ్రి అయిన మొదటి వ్యక్తి భగవంత్ సింగ్ మాన్. ఈయన 2022 జులైలో గురుప్రీత్‌ను రెండో వివాహం చేసుకున్నారు.

## కూటమి విచ్ఛిన్నం..



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ హర్యానాలోని మొత్తం 10 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తుందని జననాయక్ జనతా పార్టీ అధినేత, మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. "రాష్ట్రంలోని మొత్తం 10 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని జననాయక్ జనతా పార్టీ పీఏసీ సమావేశంలో నిర్ణయించింది. అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిగాయి. త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తాం" అని చౌతాలా ఏఎన్ఐకి చెప్పారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి ఓటు వేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ-జననాయక్ జనతా పార్టీ కూటమి విచ్ఛిన్నమైన కొన్ని రోజులలోనే జేజేపీ నుంచి ఒంటరి పోటీ నిర్ణయం వచ్చింది. ఈ కూటమి విచ్ఛిన్నం మార్చి 12న మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామాకు దారితీసింది. నయాబ్ సింగ్ సైనీ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నయాబ్ సైనీ కురుక్షేత్ర నుండి బీజేపీ లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆయన పార్టీ రాష్ట్ర చీఫ్‌గా నియమితులయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హర్యానాలోని మొత్తం 10 పార్లమెంటు స్థానాలను గెలుచుకుంది. అయితే ఆప్‌తో పొత్తు పెట్టుకుని ఎన్నికల బరిలో దిగిన జేజేపీ పోటీ చేసిన 7 స్థానాల్లోనూ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. కాగా హర్యానాలో 2024 సార్వత్రిక ఎన్నికలు మే 25న ఆరో దశలో జరగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

## కంగనాపై అసభ్య పోస్ట్..
## సుప్రియాకు షాకిచ్చిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** సినీ నటీ, హిమాచల్ ప్రదేశ్‌లోని మండి బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కంగనా రనౌత్‌పై సోషల్ మీడియా వేదికగా చేసిన అసభ్యకర వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనతే భారీ మూల్యం చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బుధవారం విడుదల చేసిన లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల జాబితాలో సుప్రీయా శ్రీనతేకు టికెట్ నిరాకరించింది. 2019లో సుప్రీయా శ్రీనతే



ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈసారి కూడా మహారాజ్‌గంజ్ నుంచి తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయిస్తుందని సుప్రియా శ్రీనతే ఆశాభావం వ్యక్తం చేశారు. 2019లో సుప్రియా శ్రీనతేపై బీజేపీ అభ్యర్థి పంకజ్ చౌదరీ విజయం సాధించారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఈసారి మహారాజ్‌గంజ్‌లో వీరేంద్ర చౌదరిని బరిలోకి దింపింది. సుప్రియా శ్రీనతే సోషల్ మీడియా ఖాతా నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి కంగనా రనౌత్‌పై వెలువడిన అసభ్యకరమైన విమర్శలు కాస్త వివాదం రేపాయి. అయితే ఈ నేపథ్యంలో ఆమెకు కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈసారి తాను లోక్ ఎన్నికల్లో పోటీ చేయనని కాంగ్రెస్ పార్టీని కోరినట్లు తెలిపారు. అయితే తన స్థానంలో మరో అభ్యర్థి పేరును సూచించినట్లు సుప్రియా పేర్కొన్నారు. కంగనాపై చేసిన అసభ్యకరమైన పోస్ట్‌పై.. సుప్రియా శ్రీనతే వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు. తన సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డులు పలువురికి తెలుసని తనకు తెలియకుండానే కంగనాపై అసభ్యకరమైన పోస్ట్ వేశారని తెలిపారు. ఈ పోస్ట్ తన దృష్టికి రావటంతో డిలీట్ చేశానని తెలిపారు.'సుప్రియాపేరడీ' అనే 'ఎక్స్' అకౌంట్ నుంచి పోస్ట్ చేశారని.. దాని నిర్వాకులు ఎవరో తెలియదన్నారు. తన 'ఎక్స్'ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. అప్పటికే ఆమె పోస్ట్ వివాదస్పదం కాగా.. బీజేపీ నేతలు ఆమెపై మండిపడ్డారు. ఇలా మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనతేకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. మార్చి 29 సాయంత్రం 5 గంటలోపు స్పందించాలని కోరింది. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల కోడ్)ని ఉల్లంఘించినట్లు పోల్ ప్యానెల్ తెలిపింది. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని ఈసీ ఆదేశించింది.

## న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు

**సీజేఐకి 600 మంది న్యాయవాదుల సంచలన లేఖ**

**న్యాయస్థానాల పరువు, ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు**

**కొందరు లాయర్లు పగటిపూట రాజకీయ నాయకులను సమర్థించి.. రాత్రిపూట మీడియా ద్వారా న్యాయమూర్తులను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు**

**కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు**



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా సహా దాదాపు 600 మంది ప్రముఖ న్యాయవాదులు లేఖ రాశారు. పొలిటికల్ అజెండాతో కొన్ని 'ప్రత్యేక బృందాలు' తమ స్వార్థ ప్రయోజనాల కోసం న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయస్థానాల పరువు, ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లేఖ రాసిన వారిలో ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, ఆదిష్ అగర్వాల్, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేష్ జైన్, ఉజ్వల వార్, ఉదయ్ హొల్లా, స్వరూపమా చతుర్వేది, సహా దేశవ్యాప్తంగా 600 మందికిపైగా న్యాయవాదులు ఉన్నారు. వీరంతా లేఖలో ఒకవర్గం న్యాయమూర్తులను తమ పేర్లు ప్రస్తావించకుండా టార్గెట్ చేస్తూ ఈ ఆరోపణలు చేశారు. కొందరు లాయర్లు పగటిపూట రాజకీయ నాయకులను సమర్థించి.. రాత్రిపూట మీడియా ద్వారా న్యాయమూర్తులను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా రాజకీయ నేతలకు సంబంధించిన అనేక కేసుల్లో వారు కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఇందుకోసం వారు అనేక మార్గాలను అనుసరిస్తున్నారు.

కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు నిర్ణయాలు తమకు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగ విమర్శలకు దిగుతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. న్యాయస్థానాల కోసం నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ లేఖను మార్చి 26 రాసినట్లు సమాచారం.

# కేకే పార్టీ జంప్!

-మొదటి పేజి తరువాయి

అనివార్యంగా మారిందని చెప్పినట్టు తెలిసింది. పార్టీ మారుతానని కేశవరావు చెప్పగానే కెసిఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. మరో సారి ఆలోచించుకోవాలని కేకేకు చెప్పినట్టు తెలిసింది.

**లోపల గరం.. గరం**

ఫాంహౌస్ లోపల అంతా గరంగరంగా సమావేశం జరిగినట్టు తెలిసింది. నేను పుట్టింది కాంగ్రెస్‌లో.. కాంగ్రెస్ లోనే చనిపోతానని తేల్చిచెప్పిన కేకే చెప్పగా.. కెసిఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పదేళ్లు అధికారం అనుభవించి ఇప్పుడు పార్టీ వీడతానంటే ఎలా? ప్రజలు అన్నీ గమనిస్తారని కేసీఆర్ మండిపడ్డట్టు సమాచారం. నీకు, నీ ఫ్యామిలీకి పార్టీ ఏం తక్కువ చేసిందని కేసీఆర్ ప్రశ్నించినట్టు తెలిసింది.


బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ, పార్టీ జనరల్ సెక్రటరీ కంచర్ల కేశవ రావుపై ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల కేకే వ్యవహరిస్తున్న తీరుపై కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "నీ ఫ్యామిలీకి పార్టీ ఏం తక్కువ చేసింది" అంటూ ఆయన వద్దే అసహనం వ్యక్తం చేశారు. కేశవరావు వచ్చి కలిసిన సందర్భంలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ భేటీ అనంతరం కేకే కూడా తీవ్ర అసహనంతో ఇంటికి వెళ్లిపోయారు. ఇక కేకే నివాసానికి మాజీ ఇంద్ర కరణ్ రెడ్డి వెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఇంద్ర కరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారంటూ ఊహాగానాలు వ్యక్తమవుతోన్న విషయం తెలిసిందే.

**కేకే అభ్యంతరాలు ఇవి**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ప్లానింగ్ లేకుండా అభ్యర్థులను ఎంపిక చేశారు జాతీయ రాజకీయాల్లో అనవసరంగా తల దూర్చారు

౧%ు=ూ% పేరును %దీ=ూ%గా మార్చి గాల్లో మేడలు కట్టారు

మహారాష్ట్రలో ప్రచారం చేయడం పెద్ద తప్పు అసలు రాజకీయ క్షేత్రం తెలంగాణను వదిలిపెట్టారు పార్టీని నమ్ముకున్న నాయకుల మాటలను పెడచెవిన పెట్టారు కొందరు అధికారులకు ఎక్కడ లేని ప్రాధాన్యత ఇచ్చారు నిర్ణయాధికారాల్లో ప్రజలు ఎన్నుకున్న నాయకుల కంటే



అధికారుల మాట విన్నారు

**కూతురు వెంటే కేకే**

ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరికకు కేకే కూతురు మేయర్ విజయలక్ష్మి రంగం సిద్ధం చేసుకుంది. కేకేను కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ పార్టీలోకి ఆహ్వానించిన సంగతి తెలిసిందే. దాంతో ఆయన పార్టీ మారుతారనే ప్రచారాన్ని కేకే నిజం చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన వ్యాఖ్యలు దీనికి ఆజ్యం పోశాయి. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్, బీజేపీకే అధిక సీట్లు వస్తాయంటూ కేకే చేసిన ప్రకటన సంచలనమయింది. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న కేకే.. ఏకంగా బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉండబోతుందంటూ చెప్పడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ నుంచి హైదరాబాద్ నివాసానికి చేరుకున్న కేకే..ఇంటివద్ద విజువల్స్ తీస్తున్న మీడియా ప్రతినిధుల పైకి దురుసుగా దూసుకు వచ్చారు. తీసుకుంటారా వీడియా.. నన్ను తీసుకోండి అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు.

**కేసీఆర్.. కేకే.. సుదీర్ఘ ప్రయాణం**

ఉమ్మడి రాష్ట్రానికి పీసీసీ చీఫ్ గా పని చేసిన కేకే.. ఒకప్పుడు కాంగ్రెస్‌లో అత్యంత సీనియర్. సోనియాగాంధీకి నమ్మిన బంటులా ఉండేవాడంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీని వీడి నాటి టీఆర్ఎస్ లో చేరారు. కేకేకు ఏకంగా పార్టీ సెక్రటరీ జనరల్ ఇచ్చారు కేసీఆర్. వరుసగా రెండు సార్లు రాజ్యసభకు పంపించారు కేసీఆర్. పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత పదవి కూడా ఇచ్చారు. అభ్యర్థుల ఎంపిక కమిటీకి కూడా కేకేనే ఛైర్మన్ గా వ్యవహరించారు. కేకే కూతురు విజయలక్ష్మికి జీహెచ్ఎంసీ మేయర్ పదవిని ఇచ్చారు.

**పోతూ పోతూ విసుర్లు.. మీడియాపై కేకే ఫ్రస్టేషన్**

కేసీఆర్‌తో భేటీ అనంతరం కే కేశవరావు తన అసహనాన్ని మీడియాపై ప్రదర్శించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌజ్ నుంచి తన నివాసానికి చేరుకున్న సమయంలో మీడియా ప్రతినిధులు విజువల్స్ తీస్తుండగా ఫ్రస్టేషన్‌కు గురయ్యారు. ఇంటివద్ద వీడియోలు తీస్తున్న ప్రతినిధులపైకి దురుసుగా దూసుకొచ్చారు. "నన్ను వీడియో తీసుకోండి" అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు.

కాగా కేకే కూతురు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైంది. ఎల్లుండి ఆమె పార్టీలో చేరబోతున్నట్టు క్లారిటీ వచ్చింది. కాగా కే కేశవ రావు కూడా హస్తం పార్టీ గూటికి చేరబోతున్నారంటూ ఊహాగానాలు వెలువడుతున్నాయి. పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికరమైన చర్చ కూడా జరగుతోంది. మరి కేకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి. మరోవైపు కేకే కుమారుడు విప్లవ్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరబోనని ప్రకటన చేశారు. పార్టీ మారే పరిస్థితి వచ్చిన తర్వాత కేకే తన అసంతృప్తిని బయటపెట్టారు. తానిచ్చిన ఇన్ పుట్స్ ను కేసీఆర్ పట్టించుకోలేదు, బీఆర్ఎస్ కుటుంబ పార్టీగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ అనవసరంగా జోక్యం చేసుకున్నారని, ఇంజనీర్లు చేయాల్సిన పనిలో తల దూర్చారని, ఆ పని నిపుణులు చేయాల్సిందన్నారు. రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం ఏప్రిల్ 30న కేకే కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరుతున్నట్టు తెలిసింది.

**మా నాన్న సంగతి నాకు తెలియదు : కేకే కొడుకు విప్లవ్**

"పార్టీ మారే ఆలోచనలో కె.కె, విజయలక్ష్మి ఉన్నట్టు వస్తున్న వార్తలకు, వారు తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేనే బీఆర్ఎస్ లోనే ఉన్నాను, మా నాయకుడు కేసీఆర్ నాయకత్వంపై నాకు నమ్మకం ఉంది. కేకే, విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరితే, వారు ధృవీకరిస్తే అప్పుడు మాత్రమే నేను మరింత మాట్లాడగలను."

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

-మొదటి పేజి తరువాయి

తీసుకున్న పోలీ సులు.. లోతుగా విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా.. ఈ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఇవాళ అంతా విచారించి.. ఆ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. ప్రణీత్‌కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే మాటల యుద్ధం జరుగుతోంది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎన్‌స్పెక్టర్ గట్టు మల్లును అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వీరిని గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు విచారిస్తున్నారు. ప్రభాకర్ రావు, ప్రణీత్ రావుతో ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు.

కాగా ప్రణీత్‌రావుపై కేసు నమోదుకాగానే రాధాకిషన్‌రావు అమెరికా వెళ్లిపోయారు. లుకౌట్ నోటీసులు జారీ చేయడంతో హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. ప్రణీత్ రావు డ్రైవర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభాకర్‌రావుతో సమానంగా రాధాకిషన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతో రాధాకిషన్ గట్టుమల్లు కీలకపాత్ర వహించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ప్రణీత్‌రావుతో పాటు




అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రముఖుల వ్యక్తిగత విషయాలపై వీరు నిఘా పెట్టి, ప్రభుత్వం మారాక హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసినట్లు ఆరోపణలున్నాయి. మరో వైపు భుజంగరావు, తిరుపతన్నను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో బుధవారం వాదనలు ముగియగా.. న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

**డీసీపీ పేరు వెలుగులోకి!**

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్‌నూ తాకిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావు పేరు వెలుగులోకి రాగా.. తాజాగా శివారు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ మాదిరి విభాగానికి (ఎస్‌వోటీ) ఇన్‌చార్జిగా వ్యవహరించిన డీసీపీ పాత్రను దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాన్-క్యాడర్ అధికారే అయినా.. ఆయన ఆ కమిషనరేట్‌లో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత కీలకమైన దాదాపు అన్ని జోన్లకు డీసీపీగా పనిచేసినట్లు సమాచారం. సదరు అధికారి తన టీమ్‌తో కలిసి రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీసులు అనుమానిస్తున్నారు.

**15 మంది సంగతేంటి..?**

రియల్ ఎస్టేట్ పరంగా కీలకమైన జోన్లు కావడంతో.. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసి, విధేయతను చాటుకున్నారని సమాచారం. సదరు డీసీపీ గత ప్రభుత్వ పెద్దలకు సమీప బంధువు కావడంతో.. సీపీ స్థాయి అధికారి కూడా ఆయన చర్యలను పెద్దగా పట్టించుకునేవారు కాదని భావిస్తున్నారు. ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్‌లో పాతుకుపోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ, డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా.. ఓఎస్డీలుగా కొనసాగారు. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

# ఏప్రిల్ 25 నుంచి సమ్మర్ హాలీడేస్

**హైదరాబాద్ :** తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతుంది. రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి. ఎండల నేపథ్యంలో మార్చి 15 నుంచే రాష్ట్రంలో స్కూళ్లకు ఒంటి పూట బడులు మొదలయ్యాయి. మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 వరకు తెలంగాణలో ఒంటి పూట బడులు ఉంటాయి. ఏప్రిల్ 24 పాఠశాలలకు చివరి వర్కింగ్ డే గా తెలుస్తోంది. ఎండల తీవ్రత దృష్ట్యా ఏప్రిల్ 25 నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించే అవకాశం ఉంది. దీనిపై ఇంకా విద్యాశాఖ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.రాష్ట్రంలో మార్చి 15 నుంచి ఒండి పూట బడులు ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవచ్చు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మంచి నీటి సదుపాయం ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో ఏప్రిల్ 25 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులుప్రకటించే అవకాశం ఉంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవులు




అమలుచేయాలి. ప్రైవేట్ స్కూల్స్ లో తొమ్మిది పూర్తి చేసి పదో తరగతి వెళ్లే విద్యార్థులకు స్పెషల్ క్లాస్ ల పేరిట తరగతులు నిర్వహిస్తున్నారు. ఇలా ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని విద్యాశాఖ అధికారులు గతంలో తెలిపారు. మార్చి 18 నుంచి పదో విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 2వ తేదీ పరీక్షలు ముగుస్తాయి. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సెలవులు ఉంటాయి. దీంతో పదోతరగతి విద్యార్థులకు 60కి పైగా రోజులు సెలవులు వస్తుంటాయి.రాష్ట్రంలో ఏప్రిల్ 25 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉండే అవకాశం ఉంది. జూన్ 12 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు రీఓపెన్‌అవుతాయని అధికారులు అంటున్నారు. వేసవి సెలవులపై ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని విద్యాశాఖ తెలిపింది. ప్రస్తుతం ఒంటిపూట బడులు కొనసాగుతున్నాయని, విద్యార్థులు మధ్యాహ్నం పూట ఎండలో ఆటలు ఆడకుండా పేరెంట్స్ ఓ కన్నేసి ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా ఉండనున్నాయి. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా తరచూ మంచినీరు, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ తాగాలని సూచించారు.

## మేడిపల్లి పీఎస్‌లో బండి సంజయ్‌పై కేసు

**మేడ్చల్ జిల్లా:** మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్‌పై కేసు నమోదైంది. చెంగిచర్లలో పిట్టల బస్తి బాధితులను పరామర్శించ డానికి బండి సంజయ్, అతని అనుచరులు రాగా, పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో కింద పడిన నాచారం సీఐ నందీశ్వర్ రెడ్డికి గాయాలయ్యాయి. సీఐ ఫిర్యాదుతో బండి సంజయ్‌తో పాటు మరో పది మందిపై 332, 353, 143, 149 ఐపీసీ 3, 4పీడీపీపీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



## హైదరాబాద్ ఎంపీగా సానియా మీర్జా పోటీ?!

-మొదటి పేజి తరువాయి

ఎంపిక విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ఎంఐఎంకు పట్టున్న హైదరాబాద్ నియోజకవర్గంలో సానియా మీర్జాను పోటీకి నిలపడం ద్వారా ఒవైసీకి చెక్ పెట్టవచ్చనే యోచనలో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన సానియా మీర్జా.. గతంలో తెలంగాణ రాష్ట్ర అంబాసిడర్‌గా ఉన్నారు. ఇక ఆమె చెల్లెలు ఆనం మీర్జా.. టీమిండియా మాజీ కెప్టెన్, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజారుద్దీన్ కోడలు అన్న విషయం తెలిసిందే. అజారుద్దీన్ కుమారుడు మహ్మద్ అసదుద్దీన్‌తో 2019లో ఆనం వివాహం జరిగింది.



ఫలితంగా అప్పటికే మీర్జా- అజారుద్దీన్ మధ్య ఉన్న స్నేహం.. బంధుత్వంగా మారింది. ఇక కాంగ్రెస్ పార్టీలో నాయకుడిగా కొనసాగుతున్న అజారుద్దీన్ ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ? ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓడిపోయాడు.

అయితే, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సానియా మీర్జా అభ్యర్థిత్వం గురించి అజారుద్దీన్ కాంగ్రెస్ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సైతం ఈ అంశాన్ని లోతుగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా.. మీర్జా కుటుంబం నుంచి మాత్రం ఇంతవరకు ఎలాంటి స్పందనా రాలేదు.

ఇదిలా ఉంటే.. సానియా మీర్జా.. తన భర్త షోయబ్ మాలిక్‌కు విడాకులు ఇచ్చినట్లు మీర్జా ఫ్యామిలీ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేవలం తన కుమారుడు ఇజహాన్ బాగోగులు, టెన్నిస్ అకాడమీ అభివృద్ధి పైనే దృష్టి సారించిన సానియా మీర్జా రాజకీయంగా స్టెప్ తీసుకోనున్నారంటూ వార్తలు రావడం ఆసక్తిని కలిగిస్తోంది. అయితే, దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్‌పై బాల్క సుమన్ తీవ్ర విమర్శలు

**వివేక్ కుటుంబం పెద్దపల్లిలో సామ్రాజ్యవాద విస్తరణకు కుట్రలు చేస్తోందని ఆరోపణ**

**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శ**

**ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న బాల్క సుమన్**




కాంగ్రెస్ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబం పెద్దపల్లిలో సామ్రాజ్యవాద విస్తరణకు కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. గురువారం ఆయన గోదావరిఖనిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హామీలపై ప్రశ్నిస్తోన్న ప్రతిపక్షాల మీద కాంగ్రెస్ కేసులు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారాలు, పదవులు, ఆస్తులు కాపాడుకోవడానికి వివేక్ వెంకటస్వామి పెద్దపల్లిని ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. పెద్దపల్లి వివేక్‌కు సామంత రాజ్యమేమీ కాదన్నారు. వేలకోట్ల ఆస్తులున్న వివేక్ కి దమ్ముంటే జనరల్ సీట్లలో పోటీ చేయాలని సవాల్ చేశారు. పెద్దపల్లి ప్రాంత దళిత సామాజిక వర్గాలను వివేక్ కుటుంబం అణగదొక్కుతోందన్నారు.

## రేవంత్ లీక్ వీరుడా.. గ్రీకువీరుడా? బీజేపీ ఎంపీ కొత్త సవాల్



**హైదరాబాద్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీరియస్ కామెంట్స్ చేశారు బీజేపీ ఎంపీ లక్ష్మణ్. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తాటాకు చప్పుడు కాదని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కాగా, ఎంపీ లక్ష్మణ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..'గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడితే.. సందట్లో సడేమియా అన్నట్టుగా అధికారులు సర్దుకున్నారు. గత ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడింది. రాజ్యాంగం కల్పించిన హక్కును గత ప్రబుత?ం అణచివేసింది. తెలంగాణను అబాసుపాలు చేసింది. పోలీసుల అనుమతితో ఒకటి రెండు ఫోన్ ట్యాపింగ్‌లు జరగవచ్చని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఉప ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐతో విచారణ జరిపించాలి. వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు తాటాకు చప్పుడు కాదని నిరూపించుకోవాలి. లీక్ వీరుడు కాదు.. గ్రీక్‌వీరుడైతే సీబీఐ విచారణకు వెంటనే ఆదేశించాలి. కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుంది. కేసీఆర్ కుటుంబాన్ని శిక్షించాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు' అని వ్యాఖ్యలు చేశారు.

## సంపాదకీయం

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

ప్రకృతికి సవినయ ప్రణతులు. ప్రకృతి ప్రసాధించిన సహజ వనరులతోనే ప్రాణికోటి మనుగడ సుసాధ్యం అయ్యింది. ఏమీ అడగకుండా అన్నీ అందుబాటులో ఉంచింది భూమాత. గాలి, నేల, నీరు అనే మూడు అత్యుత్తమ వనరులను దేవతలుగా పూజించే సంస్కృతి మనది. నేల తల్లి, వాయు దేవుడు, గంగామాతలను ఆరాదిస్తూ మనవ జీవితాలు సుసంపన్నం అవుతున్నాయి. నీరు ప్రాణాధారమయ్యింది. నీటి నిల్వల్లో సాగరాలు, సరస్సులు, చెరువులు, ఆనకట్టలు, భూగర్భ జలాలు, ఉపరితల జలాలు, మంచు కొండలు, గ్లేసియర్లు లాంటివి ప్రముఖంగా వస్తాయి. ఉపరితల జల నిధులు, భూగర్భ జల సంపదలతోనే సకల జీవరాశులు మనుగడను సాగిస్తున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. భూఉపరితల జలాలతో పాటు భూగర్భ జల వనరులను కాపాడుకోవడానికి వేరు వేరు మార్గాలను అనుసరించాల్సి ఉంటుంది. ఉపరితల జల నిధులు పెరిగితే భూగర్భ జలాలు సమృధిగా లభిస్తాయనే విషయం మనకు తెలుసు. ఊరి చెరువు మత్తడి దునికితే ఆ ఊరి వ్యవసాయ బావుల్లో భూగర్భ జలవనరులు పొంగి పొర్లుతూ గ్రామదేవత సస్యశ్యామలంగా హరిత తివాచీలను పరిచినట్లు ఆనందాల విందును చేస్తుంది. నానాటికీ తరిగి పోతున్న ఉపరితల జలరాశులను కళ్లారా చూస్తున్న మానవ సమాజం తగు ముందు జాగ్రత్తలను తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశుద్ధ్య వ్యవస్థలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యావరణ వ్యవస్థలు, వాతావరణ మార్పులకు భూగర్భ, ఉపరితల జలాలు ఆధారమని తెలుసుకోవాలి. భూగర్భ జలనిధులు తరిగిన కొలది నీటి కొరత, నీటి నాణ్యతకు తూట్లు పడడం జరుగుతున్నది. మే-2022లో నిర్వహించనున్న 'గ్రౌండ్ వాటర్, కీ టు ది సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' అనబడే అంతర్జాతీయ సదస్సుతో పాటు 08 డిసెంబర్ 2022న జరిగిన 'యూయన్ - వాటర్ సమ్మిట్ ఆన్ గ్రౌండ్ వాటర్'తో పాటు మార్చి 23-24లో నిర్వహించిన "యూయన్ వాటర్ కాన్ఫరెన్స్-2023" నేపథ్యంలో భూగర్భ జల అంశానికి మరో సారి ప్రాధాన్యం సంతరించుకున్నది. ప్రపంచ దేశాల్లో భూగర్భ జలాల మీద ఇండియా అత్యధికంగా ఆధారపడి ఉన్నది. 2017లో 248.69 బిలియన్ క్యూబిక్ మీటర్స్ నీరు అందుబాటులో ఉండగా, ఇండియాలో వాడబడే భూగర్భ నీటి నిధుల్లో 89 శాతం వ్యవసాయ రంగానికి, 9 శాతం గృహ అవసరాలకు, 2 శాతం పారిశ్రామిక అవసరాలకు వాడుతున్నాం. 'సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్' అంచనాల ప్రకారం వార్షికంగా అందుబాటులో ఉండే భూగర్భ జలాల్లో 70 శాతం వరకు మాత్రమే వాడుకోవచ్చని నిర్ణయించారు. భారత దేశం 2004లో 58 శాతం, 2017లో 63 శాతం వరకు భూగర్భ జలాలను వినియోగించడం గమనించారు. దేశంలోని పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, చండీఘర్, హిమాచల్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు దాదాపు 70 శాతం వరకు వాడడం జరిగింది. భారతంలోని 22 రాష్ట్రాలు/యూటీల్లోని 534 జిల్లాల్లోని 202 జిల్లాలు దాదాపు 71 నుంచి 385 శాతం వరకు వినియోగించుకోవడం మరింత భయానికి కారణమవుతున్నది. 2030 నాటికి దేశంలోని అన్ని జిల్లాలు 70 శాతం వరకు మాత్రమే వాడుకునేలా చర్యలు తీసుకోవడం ప్రారంభమైంది. భూగర్భ జలాలను అధికంగా తోడినపుడు జలంలో ప్రమాదకర ఫ్లోరైడ్, ఐరన్, లవణ ధర్మం, నైట్రేట్స్, ఆర్సెనిక్ పరిమాణాలు పెరిగి ప్రజారోగ్యం సంక్షోభంలో పడవచ్చని హెచ్చరిస్తున్నారు. 2006లోనే 109 జిల్లాలో నైట్రేట్ సమస్యలను ఎదుర్కోగా నేడు 335 జిల్లాల నీటి నాణ్యతలు ప్రమాదపు అంచున నిలబడడం గమనించారు. భూగర్భ జలాలతో ఉపరితల జలాలను అనుసంధానం చేయడానికి ప్రాంతాల వారీగా చొరవ తీసుకోవాలి. ఉపరితల,భూగర్భ జలాల లభ్యతల ఆధారంగానే వ్యవసాయ పంటలను, పంటల సాంద్రతలను నిర్ణయించుకోవాలి. నేడు పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత కరెంట్ అందుబాటులో ఉంచడంతో రైతులు విచక్షణారహితంగా వేయి మీటర్ల లోతు వరకు బోర్లను వేసి భూగర్భ జలాలను పాతాళంలోంచి పైకి లాగడంతో భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడనున్నాయని గమనించాలి. భూగర్భ జలాలతో నీటి ఎద్దడి, శుష్క భూములు, పాక్షిక శుష్క ప్రాంతాల అవసరాలు తీరడానికి ప్రభుత్వ చట్టాలకు మరింత పదును పెట్టాల్సిన అగత్యం ఏర్పడుతున్నది. భూగర్భ జలాల లభ్యతతో సామాజిక-పర్యావరణ సవాళ్లు ముడిపడి ఉన్నాయి. ప్రభుత్వాలు సాంకేతిక, ఆర్థిక, న్యాయపరమైన, పాలనపరమైన మధ్యవర్తిత్వాలు సకాలంలో జరిగితే రాబోయే తరాలకు నీటి లభ్యత సమస్యలు ఉండవని గమనించాలి. జలంతో జీవనం, జీవనంతోనే ఆరోగ్యం సిద్ధిస్తాయని ఆశిద్దాం. భూగర్భ, ఉపరితల జల వనరులను అమూల్య జాతి సంపదగా గుర్తించి కాపాడుకోవాలి.

# బ్రిటీష్ పాలకుల తొలి ధిక్కార స్వరం



బ్రిటిష్ రాచరిక నిరంకుశ పాలనను, పక్షపాత ధోరణిని, పంటి బిగువున భరిస్తూ, ఎదురించలేక, తలవంచుకుని బానిసలుగా బతుకుతున్న భారతీయుల నిస్సత్తువకు నూతన శక్తిని ప్రసాదించి, ఆలో చనలను స్వేచ్ఛాస్వాతంత్ర్యాల వైపుకు మళ్లించిన స్వేచ్ఛా ప్రియుడు మంగళ్ పాండే. మూడు పదుల వయసు చూడ కుండానే ప్రాణ త్యాగానికి సిద్ధపడి, ఉరి కంబాన్ని ముద్దాడిన యువ కిశోరం పాండే. 1857 నాటికి యావద్భారతాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్న బ్రిటీష్ పాలకుల ఆజ్ఞలను ధిక్కరించి . ఆ కొసలో సిపాయిల తిరుగుబాటుగా చరిత్ర పుటల్లో నిలిచిన. ప్రప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంకు బీజం వేసి, ధిక్కార స్వరాన్ని వినిపించి, సంగ్రామానికి మీసాన్ని మెలితిప్పి, చావు తప్పదని తెలిసి, మొక్కవోని ధైర్య సాహసాలను ప్రదర్శించి, భారత జాతికి మార్గదర్శకునిగా నిలిచిన మేరు నగ ధీరుడు మంగళ్ పాండే. 1857, మార్చి 29... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మరచి పోలేని దినం. ప్రాణాలను పణం గా పెట్టి, బ్రిటీష్ పాలకుల ఆజ్ఞలను ధిక్కరించిన తొలి సైనికుడుగా మంగళ్ పాండే చరిత్ర పుటల్లో చేరిన రోజు.బెంగాల్ నేటివ్ ఇన్ ఫాంట్రీ లో ఒక సాధారణ సిపాయిగా పనిచేసిన మంగళ్ పాండే 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటాని నాంది పలికాడు.1827, జూలై 19న ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లా నాగ్వ గ్రామంలో జన్మించి, 34 వ బ్రిటీష్ బెటాలియన్ లో పనిచేసిన అతిచిన్న వయస్సు గల బ్రాహ్మణ యువకుడు మంగళ్ పాండే, తూటాని వినియోగించేది లేదని తేల్చి చెప్పేశాడు. దూషణకు దిగిన సైనికాధికారి లెఫ్టినెంట్ బాగ్‌ని మంగళ పాండే కాల్చి చంపేశాడు. దీంతో క్రమశిక్షణ చర్యల కింద పాండేని ఆంగ్లేయులు ఉరి తీశారు. అలా 1857, మార్చి 29న కలకత్తాలో బ్రిటీష్ సార్జెంట్ పై మంగళ్ పాండే దాడిచేయడంతో సిపాయిల తిరుగుబాటుకు నాంది పలికింది.

భారతీయుల్లో బానిసత్వ భావాన్ని పారద్రోలుతూ.. స్వాతంత్ర్య కాంక్షని ఉవ్వెత్తున రగిలించిన తొలి ఉద్యమం 1857 సిపాయిల తిరుగుబాటు. అప్పటి వరకు బ్రిటీష్ పాలకుల అజమాయిషీని భరిస్తూ, సామాజిక వివక్ష, లెక్కలేనన్ని అవమానాలు, అంగీకరించలేని స్థాయిలో అసమానతలను సైతం పంటిబిగువన భరిస్తూ వచ్చిన భారతీయ సిపాయిలు.. చివరికి తమ మనోభావాలను దెబ్బతీసేందుకు బ్రిటీషర్లు ప్రయత్నించడంతో తిరగబడ్డారు. ఈ తిరుగుబాటు భారతదేశ స్వాతంత్ర్య పోరాట గతి రీతినే సమూలంగా మార్చేసింది. బ్రిటీష్ పాలకుల పక్షపాతం సిపాయిల్లో తిరుగుబాటు జ్వాల రగిలించింది. 1856లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన జనరల్ బ్రిటీష్ ఎన్‌లిస్ట్‌మెంట్ యాక్ట్ ప్రకారం సిపాయిలు బ్రిటీష్ పాలనలోని ఏ దేశంలోనైనా విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో కొంతమంది హిందువులు ఈ యాక్ట్‌పై నిరసన తెలిపారు. అలాగే 1856లోనే రాయల్ కంపెనీ ఎన్‌ఫీల్డ్ తుపాకుల్ని సైన్యంలోకి ప్రవేశ పెట్టింది. వీటిల్లో వినియోగించే తూటాలను సిపాయిలు నోటితో కొరికి అమర్చాల్సి ఉండేది. కానీ.. ఈ కొరకాల్సిన భాగంలో ఆవు, పంది కొవ్వుని పూశారనే వదంతి అంతటా వ్యాపించింది. దీంతో ఆవును పవిత్రంగా భావించే హిందువులతో పాటు.. పందిని అపవిత్రంగా భావించే ముస్లింలు ఈ తుపాకుల వినియోగాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఫిబ్రవరి 26, 1857న ప్రయోగాత్మకంగా తుపాకుల్ని పరీక్షించాలని బ్రిటీషర్లు ఆదేశించగా.. బారక్‌పూర్‌లోని 19వ దళం సిపాయిలు వ్యతిరేకించారు. దీంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.సిపాయిల తిరుగుబాటు అనంతరం 1857, మార్చి 29న అదే బారక్‌పూర్‌లోని 34వ పటాలానికి చెందిన మంగళ పాండే తూటాని వినియోగించేది లేదని తేల్చి చెప్పేశాడు. దీంతో అతనిపై దూషణకి దిగిన సైనికాధికారి లెఫ్టినెంట్ బాగ్‌ని మంగళ పాండే కాల్చి చంపేశాడు. దీంతో క్రమశిక్షణ చర్యల కింద పాండేని ఆంగ్లేయులు ఉరి తీశారు. అనంతరం 19, 34 పటాలాలను రద్దు చేశారు. అయితే.. ఈ తిరుగుబాటు దావానంలా దేశం మొత్తం వ్యాపించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సిపాయిలు ఆ తూటాలను వినియోగించేందుకు నిరాకరించారు. దీంతో వారిని ఉద్యోగాల్లోంచి తీసేసి.. పదేళ్లు జైలు శిక్ష విధించారు. పాండే తిరుగుబాటు స్ఫూర్తితో.. ఢిల్లీ చేరిన సిపాయిలు భక్తఖాన్ ఆధ్వర్యంలో ఎర్రకోటలో ప్రవేశించి.. బహదూర్ షాని భారతదేశ చక్రవర్తిగా ప్రకటించి ఉద్యమానికి నాయకత్వం వహించమని కోరారు. కాన్పూర్‌లోనూ నానాసాహెబ్ నాయకత్వంలో తిరుగుబాటు ప్రారంభమైంది. కానీ.. సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో ఈ తిరుగుబాటు నీరు గారిపోయింది. బహదూర్ షాని బ్రిటీషర్లు అదుపులోకి తీసుకుని రంగూన్ జైలుకి తరలించడంతో ఉద్యమం గతి తప్పింది. నానాసాహెబ్ నేపాల్ పారిపోయాడు. బ్రిటీషర్లు అప్పట్లో పైచేయి సాధించినా.. ఈ సిపాయిల తిరుగుబాటు మాత్రం స్వాతంత్ర్య పోరాటంలో చెరగని ముద్ర వేసిన తొలి పోరాటంగా భారతీయుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయింది.ఆధునిక భారతదేశంలో పాండేను హీరోగా విస్తృతంగా పరిగణిస్తారు. ఆయనను గౌరవించటానికి 1984 సంవత్సరంలో భారత ప్రభుత్వం తపాలా బిళ్ళను జారీ చేసింది. హిందీ చిత్రం 'మంగల్ పాండే: ది రైజింగ్' మరియు 2005 లో 'ది రోటీ తిరుగుబాటు' అనే రంగస్థల నాటకంతో సహా అనేక సినిమాలు మరియు రంగస్థల నాటకాలు అతని జీవితంపై ఆధారపడి ఉన్నాయి.

# నిప్పుల కొలిమిపై భూగోళం!

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసిన ఏడాదిగా 2023 నిలిచిందని, 2024లో వాతావరణ మార్పులు మరింత జటిలం కానున్నాయని ఐరాస విడుదల చేసిన తాజా "గ్లోబల్ క్లైమేట్ రిపోర్ట్" స్పష్టం చేయడం ఓ ప్రమాద హెచ్చరికగా పరిగణించాలి. ఐరాసకు చెందిన 'ప్రపంచ వాతావరణశాస్త్ర సంస్థ (వరల్డ్ మెటీరాలజీ ఆర్గనైజేషన్, డబ్ల్యూఎంఓ)" విడుదల చేసిన నివేదికలో క్రమంగా హరిత గృహ వాయువులు, సముద్ర జల ఉపరితల ఉష్ణోగ్రతలు, సముద్ర మట్టాలు, ఆర్కిటిక్/అంటార్కిటిక్ మంచు కొండలు కరగడం, కార్చిచ్చులు, తీవ్ర వరదలు, సైక్లోన్స్ లాంటివి విపరీతంగా పెరగడంతో మానవాళితో పాటు ప్రాణికోటి మనుగడ కూడా ప్రశ్నార్థకం కానుందనే నివేదిక బహిర్గత పరిచిన కఠిన వాస్తవాలు మనల్ని భయకంపితులను చేస్తున్నది. ప్రతికూల వాతావరణ మార్పుల ఫలితంగా అనేక ఇతర అవాంఛనీయ మార్పులు చోటు చేసుకున్నాయని నివేదిక స్పష్టం చేస్తున్నది.

మానవ ప్రమేయ వాతావరణ ప్రతికూల మార్పులతో 2023లో ఇండియాతో పాటు ఆసియా ఖండ దేశాలు అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు, కరువులు, పలు విపత్తులు నమోదు చేసుకున్నాయని డబ్ల్యూఎంఓ నివేదిక స్పష్టం చేస్తున్నది. 174 ఏండ్ల (1850 నుంచి) తర్వాత అత్యధిక వాతావరణ ఉష్ణోగ్రతలు నమోదు చేసుకున్న ఏడాదిగా 2023 నిలిచిందని పేర్కొన్నారు. పునరుత్పాదక శక్తి ఉత్పత్తులు పెరగడంతో కొంత ఊరట కలిగినా 2023 మధ్య మాసాల్లో లా నినో నుంచి ఎల్ నినో స్థితులు రావడంతో 2022 నుంచి 2023 వరకు ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడం రికార్డు కావడం గమనించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, రుతుపవనాలు ఆలస్యంగా రావడం గమనించారు. డెన్మార్క్‌కు చెందిన కోపన్‌హాగన్‌లో ఇటీవల జరిగిన కోప్-28 సదస్సులో కూడా 40 దేశాలకు చెందిన మినిస్టర్లు పాల్గొని తగు సూచనలు, ప్రణాళికలు ప్రకటించడం ముదావహం. నేడు నెలకొన్న ప్రతికూల వాతావరణ మార్పుల మూలంగా 2025, 2100 మధ్య 1,266 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లనుందనే హెచ్చరికను కూడా చేస్తున్నారు.

ఏప్రిల్ 2023లో భారత్‌తో పాటు బంగ్లాదేశ్ ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచాయని, జూన్ 2023 నాటికి దక్షిణ భారత ద్వీపకల్పం గతంలో లేని విధంగా అధిక ఉష్ణోగ్రతలను నమోదు చేసుకుందని నివేదిక తెలిపింది. కొన్ని వందల ఏండ్ల అనంతరం జూలై 03, 2023 రోజున ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు కావడం గమనించారు. 2023లో ప్రపంచ సగటు ఉపరితల ఉష్ణోగ్రతలు 1.45 డిగ్రీల పెరుగుదల చూపాయని, 2015 - 23 మధ్య అత్యధిక వేడిని చవిచూచాయని, సముద్ర ఉపరితలాలు అధిక వేడిని అనుభవించాయని, రికార్డు స్థాయిలో సముద్ర ఉపరితలాల పెరుగుదల జరిగిందని, పెరిగిన వేడికి దాదాపు 40 ప్రపంచవ్యాప్త మంచు కొండలు కరగడం జరిగిందనే కఠిన వాస్తవాలను నివేదిక బహిర్గతం చేసింది. 2022-23లో గ్రీన్ హౌజ్ వాయువులైన కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్‌ల గాఢతలు విపరీతంగా పెరిగి ఉష్ణోగ్రతలు పెరగడానికి ఊతం ఇచ్చాయని తెలిపారు.

తీవ్రమైన వాతావరణ ప్రతికూల మార్పుల కారణంగా 2023లో 78 దేశాలకు చెందిన 333 మిలియన్ల ప్రపంచ జనాభా ఆహార అభద్రత చట్రంలో నలిగి పోయారని తెలుస్తున్నది. వాతావరణ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీలు దాటితే సముద్ర మట్టాలు పెరగడం, శాశ్వత మంచు కొండలు కరగడం, జీవ వైవిధ్యానికి తూట్లు పడడం, నీటి కోరి ఏర్పడడం, విపరీత వాతావరణ మార్పులు చోటు చేసుకోవడం, ఆహార కొరత ఏర్పడడం జరుగుతుందని గమనించాలి. ఇలాంటి వాతావరణ ప్రతికూలతలకు విరుగుడుగా హరిత గృహ వాయువుల విడుదలను కట్టడి చేయడానికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు హరిత క్షేత్రాలను పెంచడం, పునరుత్పాదక తరగని ఇంధనాల వినియోగాన్ని పెంచడం, జీవ వైవిధ్యతను కాపాడడం, కార్బన్ ఉద్గారాలను జీరో స్థాయికి తగ్గించడం అత్యవసరమని గమనించి ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు ప్రతిన బూనడం జరగాలి. 2023లో పునరుత్పాదక శక్తి ఉత్పత్తి 50 శాతం పెరిగిందని, కోప్-28 సదస్సు సిఫార్సు మేరకు 2030 నాటికి తరగని పునరుత్పాదక శక్తి ఉత్పత్తిని మూడు రెట్లు పెంచుతూ 11,000 గిగావాట్స్ వరకు చేర్చాలని నివేదిక అనివార్య సూచిస్తున్నది.

గత ఐదు దశాబ్దాలు జరుగుతున్న పర్యావరణ విధ్వంసాలను గమనిస్తున్న ప్రపంచ దేశాలు తమ తాత్కాలిక లాభాల వేటలో కళ్లు మూసుకొని తమకు పట్టనట్లు వ్యవహరించడంతో రాబోయే తరాల ఉనికి పెనం లాంటి పొయ్యిలో పడినట్లు అవనున్నదని ఐరాస "వాతావరణ రెడ్ అలెర్ట్" జారీ చేయడం మనందరి భయానికి కారణం అవుతున్నది. 2023 నమోదు చేసుకున్న తీవ్రమైన వడగాలులు 2024లో మరింత పెరగవచ్చని కూడా నిపుణులు పేర్కొనడం సామాన్యులను కలవర పెడుతున్నది. ఇప్పటికైనా పరిస్థితులను ఆకళింపు చేసుకొని "మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోకుండా", భవిష్యత్తు తరాలకు ఆస్తి కన్న మిన్న అయిన ఆరోగ్యకర వాతావరణాన్ని అందించే పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో మనమందరం సమిధలుగా మారి, రేపటి తరానికి అమూల్యమైన జీవించే చల్లని వాతావరణాన్ని బహుకరిద్దాం.

# ఇంచార్జిల పాలనకు చరమగీతమెప్పుడు?

పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటివరకు అన్ని జిల్లాల్లోని అన్ని పోస్టులను ఇంచార్జిలతోనే కొనసాగించడం శోచనీయం. ముఖ్యంగా విద్యావ్యవస్థలో జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు ఇతరత్రా కీలక పోస్టులన్నీ ఇంచార్జీల పాలనతోనే కొనసాగాయి. విద్యాహక్కు చట్టం పది శాతంకు మించి ఖాళీలు ఉండకూడదని సూచిస్తున్నా అవేవీ పట్టించుకోకుండా ఇంచార్జీలతో పాఠశాలల్లో బోధనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాష్ట్రంలోని 615 మండలాలకు గానూ 580 మండలాలకు పైగా రెగ్యులర్ ఎంఈఓలు లేరు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇంచార్జ్ ఎంఈఓలుగా కొనసాగుతున్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏకంగా 8 మండలాలకు ఇంచార్జ్ ఎంఈఓగా కొనసాగుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చును. దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా విద్యాశాఖాధికారులకు సైతం ఒకటికన్నా ఎక్కువ జిల్లాలను అప్పగించడంతో పాలన కుంటుపడింది. భావితరాల ఉపాధ్యాయులను తయారుచేసే డైట్ కేంద్రాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రిన్సిపాల్, లెక్చరర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో బోధన కొనసాగడం గగనమైంది. ఇదిలా ఉంటే అరవై శాతానికి పైగా బడులలో ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండటంతో స్కూల్ అసిస్టెంట్‌లు ఇంచార్జ్‌లుగా కొనసాగుతున్నారు. 2015లో గత ప్రభుత్వం చివరిసారిగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా పదోన్నతులు కల్పించకపోవడంతోనే నేడు ఈ ఇంచార్జ్‌ల పాలనకు కారణం. సర్వీస్ రూల్స్, కోర్టు కేసులు ఇతరత్రా కారణాలతో పదోన్నతులు వాయిదా పడుతూనే ఉన్నాయి. రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఎంఈఓ పోస్టులను భర్తీ చేసింది. ఆ ప్రభుత్వానికి అడ్డురాని సర్వీసు రూల్స్ మన రాష్ట్రంలోనే ఎందుకు అడ్డువస్తున్నాయో అర్థం కాని పరిస్థితి. తంలోని ముఖ్యమంత్రి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు. రెండు కమ్మల్లోని సర్వీసు రూల్స్ తాను దిగి పోయేంతవరకు కార్యాచరణకు నోచుకోలేదు. ఒక ప్రధానోపాధ్యాయుడికి 8 మండలాలకు పైగా బాధ్యతలు అప్పగిస్తే వ్యవస్థ ఎటుపోతుందో అర్థంకాని పరిస్థితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటు పాఠశాలలకు న్యాయం చేయలేక, ఇటు మండల బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేక పని ఒత్తిడితో సతమతమవుతున్న ఉదంతాలు కోకొల్లలు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఈ నెలాఖరు నుండి ఉద్యోగ విరమణలు మొదలవుతున్నాయి.

# స్థానిక వార్తలు

## మట్కా నిర్వాహకులు అరెస్ట్




**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని గోవింద్ పూర్ శివారులో మట్కా నిర్వహిస్తున్నారని పక్క సమాచారంతో భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్, సిబ్బందితో కలిసి రైడ్ చేసి గురువారం ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుల వద్ద నుండి 3240/- రూపాయలు, 3 మట్కా బుక్ లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు తహసిల్దార్ యూసుఫ్ తెలిపారు. మండలంలోని దోంచంద గ్రామ శివారులో గల గోదావరి నది నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని బుధవారం రాత్రి సమయంలో తన సిబ్బందితో కలిసి పట్టుకున్నట్టు తెలిపారు. ఇట్టి లారీని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు తెలిపారు. వే బిల్లులు లేకుండ ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం అని అన్నారు. ప్రభుత్వ అనుమతులు పొంది ఇసుకను రవాణా చేయాలన్నారు.

## పెరిగిన ధరలకు అనుకూలంగా కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ప్రకారం పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 1.20 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాలు సవరణ చేయాలని సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ ను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు భీరం మల్లేశం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. తక్కువ వేతనాలు నిర్ణయించి కార్మికుల కడుపులు కొట్టే చర్యకు ప్రభుత్వం పూనుకున్నదన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించి ఆదుకోవాలని అన్నారు.

## ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**






**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలలో జిల్లాలోని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ నియంత్రణ, ఎంన్ఫోర్స్మెంట్ కమిటీ, గ్రీవెన్స్ కమిటీ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేష్ లు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాలు, జప్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించ డానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఒక్క విజయం కోసం పరితపన

**హైదరాబాద్ :** తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయన్న అభిప్రాయం ఉంది. కానీ రాజకీయాల్లో ఒకే ఒక్క విజయంతో అన్ని దారులూ తెరుచుకుంటాయి. ఒక్క విజయంతో అన్నీ ప్లస్ అవుతాయి. కేసీఆర్ కు కూడా ఇప్పుడు అలాంటి అవకాశం పార్లమెంట్ ఎన్నికల ద్వారా వచ్చింది. ఈ ఎన్నికల్లో ఆయన స్వీప్ చేయాల్సిన పని లేదు. నాలుగైదు సీట్లు తెచ్చుకుని గట్టి ప్రభావం చూపించగలగితే చాలు.. పరిస్థితులన్నీ మళ్లీ సానుకూలంగా మారుతాయి. ఇప్పుడు అలాంటి ప్రభావం చూపించేందుకు కేసీఆర్‌కు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కేసీఆర్ పోరాటం చేస్తున్నారు. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆరెస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాలు సిట్టిం గ్‌లకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీచేసిన బీ వినోద్‌కుమార్‌కు అభ్యర్థికి కేటాయించారు. ఇక మిగిలిన 13 స్థానాలు కొత్తవారిని బరిలో దింపారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలో కనీస పోటీ లేదని పార్టీ వర్గాల్లోనే చర్చించుకోవడం గమనార్హం. ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రా యంతో పలువురు నేతలు ఉన్నారన్న చర్చలూ నడిచాయి. వలసలను నివారించేందుకు బుజ్జగిం పులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి బీఆరెస్ ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్‌లో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా.. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మారిపో యారు.

# సహకార సంఘం అభివృద్దే నా ధ్యేయం

**చైర్మన్ డాక్టర్ సునీల్ కుమార్**




**వాస్తవ నేస్తం,కోటగిరి:** కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామ సహకార సంఘం మహాజన సభ చైర్మన్ డాక్టర్ సునీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సహకార సంఘం ఇంచార్జ్ కార్యదర్శి కమలేష్ సంఘానికి రైస్ మిల్లు కి సంబంధించిన జమ ఖర్చులను చదివి వినిపించారు. అనంతరం ఎక్లాస్పూర్ గ్రామంలో 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 21.25 లక్షల తో నిర్మాణం కంప్యూటర్ ఆపరేటర్ నియామకం వంటి అంశాలపై తీర్మానం చేశారు. అనంతరం చైర్మన్ డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ... సహకార సంఘం అభివృద్ధి తన ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. సంఘానికి సంబంధించిన రైస్ మిల్లు కు 23 లక్షలతో నిర్మించే ప్రవారీకి, లింగాపూర్ గ్రామంలో 21.25 లక్షలతో నిర్మించే గోదాంకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. బస్వాపూర్ అర్కాస్ పల్లి లింగాపూర్ రైతులకు ఎరువుల ఇబ్బంది ఏర్పడకుండా పాత గోదాం ను రెండు లక్షల ఇరవై తొమ్మిది వేల రూపాయలతో మరమ్మతులు చేయించామని ఇకనుండి రైతులకు అక్కడనుండే ఎరువులను సరఫరా చేస్తామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ ద్వారా కాకుండా సుద్దులం సుద్దులంతాండ నాచుపల్లి తండాలలో సహకార సంఘం నుండి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం కోసం అనుమతులు తీసుకొచ్చిన సందర్భంగా చైర్మన్ డాక్టర్ సునీల్ను రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు, సంఘ సభ్యులు, రైతులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన ఎస్.ఆర్.కే మూర్తి

**59 ఓట్ల భారీ మెజారిటీతో విజయం.**

**పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేసిన న్యాయవాదులు**



**వాస్తవ నేస్తం,కోదాడ:** కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది శ్రీనివాసుల రాధాకృష్ణ మూర్తి (ఎస్ ఆర్ కె మూర్తి) ఎన్నికయ్యారు. గురు వారం కోదాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో ఆయన 59 ఓట్ల మెజారిటీతో నాళం రాజన్న పై విజయం సాధించారు. మొత్తం 106 ఓట్లు పోల్ కాగా అందులో ఒక ఓటు చెల్లలేదు. ఎస్ ఆర్ కె మూర్తి కి 82 ఓట్లు రాగా రాజన్నకు 23 వోట్లు వచ్చాయి. అదే విధంగా క్రీడా కార్యదర్శిగా పోలురి హేమలత 18 ఓట్ల మెజారిటీ తో, 1వ కార్యవర్గ సభ్యుడు గా దొడ్డ శ్రీధర్ 8 ఓట్ల మెజారిటీ విజయం సాధించారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి వెజెల్ల రంగారావు, ఉప ఎన్నికల అధికారి షేక్ జానీ పాషా, సహాయ ఎన్నికల అధికారి ఆవుల మల్లికార్జున రావు లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా ఎస్ ఆర్ కె మూర్తి విజయం సాధించడం తో న్యాయవాదులు తమ అభిందనలు తెలిపారు. బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు.

**నూతన కార్యవర్గం...**

కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా ఎస్ ఆర్ కె మూర్తి, ఉపాధ్యక్షుడిగా గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట్ల రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి గా సరికొండ హనుమంత్ రాజు, కోశాధికారిగా కోదూరు వెంకటేశ్వర రావు, గ్రంధాలయ కార్యదర్శి గా మందా వెంకటేశ్వర్లు, క్రీడా కార్యదర్శిగా పోలూరి హేమలత, మహిళా ప్రతినిధిగా ఓరుగంటి ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా దొడ్డ శ్రీధర్, సామా నవీన్ కుమార్, షేక్ నాగుల పాషా లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సీనియర్ న్యాయవాదులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, దేవబత్తిని నాగార్జున రావు, మేకల వెంకట్రావు, ఎలక సుధాకర్ రెడ్డి , పాలేటి నాగేశ్వర రావు, రామిశెట్టి రామకృష్ణ, పగడాల రామచంద్రా రెడ్డి, కాకర్ల వెంకటేశ్వర రావు, సాధు శరత్ బాబు,ఈడుల కృష్ణయ్య, గాలి శ్రీనివాస్ నాయుడు లు తమ అభినందనలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతం జరిగేందుకు సహకరించిన న్యాయవాదులు అందరికీ ఎన్నికల అధికారులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

# జడ్పీ చైర్మన్ రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు**

**వాస్తవ నేస్తం,బోనకల్:** బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి పంటలు ఎండిపోయి రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుంటే ఐదేళ్లుగా జిల్లా పరిషత్ చైర్మన్ పదవిలో ఉండి ఏనాడు మండల కేంద్రంలో పంట నష్టపోయిన రైతులను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పరిశీలన చేయలేదని కానీ నేడు ఆయన ఎండిపోతున్న పంటలు పరిశీలించడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పై తీవ్రంగా మండిపడ్డారు. సాక్షాత్తు ఒకప్పటి మాజీ సీఎం ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ బోనకల్ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించి వెళ్లి ఎకరాకు 10000 నష్టపరిహారం అందిస్తానని రైతులను బీఆర్ఎస్ మోసం చేసింది నిజం కాదా అన ప్రశ్నించారు. మీరు అన్నట్లుగా మండలంలో మొక్క జొన్న నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేలు అందించినట్లు మీరు నిరూపిస్తామంటే బహిరంగంగా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు. వర్షాలు లేక సాగర్ నీటి సామర్థ్యం తగ్గిపోయిన విషయం రాష్ట్రవ్యాప్తంగా తెలిసిందే, కానీ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క పనితీరు చూసి వారికి పుట్టగతులు ఉండవని తెలిసే అనవసర మాటలు మాట్లాడుతున్నారన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు మినుము,పెసర లాంటి పంటలు వేసుకోవాలని సూచించిన కొంతమంది రైతులు వారికి ఉన్న బావులు బోర్లతో మొక్కజొన్నను సాగు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలు చేస్తామన్నట్లుగానే, మొదటి 100 రోజుల్లోనే ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల రూపాయలు, మహిళలకు మహాలక్ష్మి ద్వారా ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలెండర్, ఇందిరమ్మఇండ్లు రైతు భరోసా లాంటి వాటిని ఇప్పటికే ప్రజలకు అందజేశామని అన్నారు. ఎర్రుపాలెం,మధిర మండలాలకు సాగర్ నీటి కొరత లేకుండా మల్లు భట్టి విక్రమార్క కృషితోనే రెండవ జోన్ లోకి ఆ రెండు మండలాలను తీసుకురావడం జరిగింది అన్నారు.అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 800 కోట్ల రూపాయల నిధులు కేటాయించిన విషయం గుర్తు చేశారు. అప్పుడు ఇప్పుడు రైతును రాజు చేసేది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమేనని కీర్తించారు మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మండలం ప్రగతి బాటలో నడిపేందుకు పక్క ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.పార్లమెంట్ ఎలక్షన్ అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోతుందని అన్నారు. ఆర్రెడీ



రాష్ట్రంలో బీఆర్ఎస్ ను ప్రజలు తరిమికొట్టారని పేరు మార్చుకొన్న బీఆర్ఎస్ కు కూడా అదే గతి పడుతుందని అన్నారు.ఎలక్షన్ కోడ్ అనంతరం ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# దుబార్ పెట్'లో రక్తదాన శిబిరం

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండలంలోని దుబార్ పెట్ గ్రామంలో ఆదివాసి బిరుదు గొండ్ తోటి యువజన సంఘం, తల్లి పిలుపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి బిరుదు గోండ్ గ్రామ అధ్యక్షుడు నైతం నాగరాజ్, గ్రామ మాజీ సర్పంచ్ చహకటి అభిమాన్ లు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లి పిలుపు జిల్లా ఇన్చార్జి లోకండే అనిల్ కుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యువజన సంఘం సభ్యులు, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.



http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
స్థానిక వార్తలు



# ఫలహారం పంచుకున్నది అందరూ.. తప్పించుకొని తిరుగుతున్నది కొందరు!

**వాస్తవ నేస్తం బ్యూరో,ఆదిలాబాద్:**

చెప్పేవి శ్రీరంగా నీతులు... చేసేవి నీచ పనులు.. అన్నట్లు కొందరు రిపోర్టర్లు అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. మావి పెద్ద పత్రికలు అంటూ లక్కీ లాటరీ పేరిట అమాయక ప్రజల నుంచి దోచుకున్న కొందరు జర్నలిస్టుల మాయ భాగోతపు పనులు బట్టబయలు కావడంతో ప్రజలు విస్తుపోతున్నారు. అవినీతి అక్రమాల గురించి పత్రికల్లో రాయాల్సిన జర్నలిస్టులు లక్కీ లాటరీ పేరిట జనాలకు కుచ్చు టోపి పెట్టడం "దయ్యాలు వేదాలు చదివినట్లుగా" ఉందని ప్రజలు మండిపడుతున్నారు. మూడేళ్ళ కిందట ఇచ్చోడ, బోథ్, సిరికొండ, నేరడిగొండ, బజార్ హత్నూర్ మండలాలకు చెందిన కొందరు దినపత్రిక రిపోర్టర్లు జర్నలిజం ముసుగులో అక్రమ మార్గంలో లక్షలు గడించడం కోసం బోథ్ కేంద్రంగా లక్కీ లాటరీ పేరిట అక్రమ దందాను నిర్వహించారు.


మహబూబ్ ఘాట్ లో లక్కీడ్రా నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి వివరాలు సేకరిస్తున్న దృశ్యం ( ఫైల్ ఫోటో)

**మీకేం కాదు.. అన్నీ నేను చూసుకుంటా...**

అక్రమ ధనార్జనే ధ్యేయంగా లక్కీ స్కీం నిర్వహించడంలో ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ఒక దినపత్రిక రిపోర్టర్ ప్రముఖ పాత్ర పోషించాడు. మీకేం కాదు.. అన్నీ నేను చూసుకుంటా... అంటూ ఒక్కొక్క లక్కీ స్కీంలో 1500 నుంచి 3000 వేల వరకు అమాయక ప్రజలను సభ్యులుగా చేర్చుకున్నారు. సభ్యులుగా చేరిన ప్రజలు నెలకు 1100 నుండి 1500 వరకు చెల్లించండి లక్కీ డ్రాలో పెద్ద పెద్ద ట్రాక్టర్లు, జేసీబీ లు కార్లు గెలుచుకోండి అని నమ్మబలికారు. డ్రా లో మీ పేరు వస్తే ఇక డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. చివరి వరకు కూడా మీకు లాటరీ తగలకుంటే మోటార్ బైకులు, ఎల్ఈడీ టీవీలు, కార్లు ఇస్తామంటూ నమ్మబలికారు.

**అమాయక గిరిజన ప్రజలే లక్ష్యంగా...**

ఈ మోసం దందాలో ఆదివాసీ గిరిజనులను, చిరు వ్యాపారులు లక్ష్యంగా పావులు కదిపారు. కలం "సాక్షిగా" ప్రజల పక్షాన పోరాటం చేస్తానని.. అమాయకులను దోచుకునేందుకు పెద్ద స్కెచ్ వేసిన ఇచ్చోడ కు చెందిన జర్నలిస్టు ప్రముఖ పాత్ర పోషించారు. అన్ని నేను చూసుకుంటా అంటూ నమ్మబలికి లాటరీ బాధితులను నిండా ముంచాడు. గత మూడు ఏళ్ల క్రితం ఈ క్రమంలో నిర్మల్ జిల్లాలోని మహబూబ్ ఘాట్ వద్ద (షేక్ సాబ్ లోద్ది) లక్కీ డ్రా నిర్వహిస్తుండగా సారంగాపూర్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి లక్కీ డ్రా నిర్వహిస్తున్న నిర్వాహకులను పట్టుకున్నారు. ఈ పాపంలో పాలు పంచుకున్న ఐదుగురికి మూడేళ్ళ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయ స్తానం బుధవారం తీర్పు ఇచ్చింది. ఇందులో ఇద్దరి జర్నలిస్టులతో పాటు మరో ముగ్గురూ ఉన్నారు. ఈ అక్రమ దందాలో కొందరు జర్నలిస్టులను యాజమాన్యాలు తొలగించాయి. పోలీసుల దాడిలో పట్టుబడిన ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ఒక రిపోర్టర్ ను సంబంధిత పత్రిక యజమాన్యం తొలగించకపోవడంతో యజమాన్యం తీరు పట్ల ప్రజల్లో సత్వర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల పక్షాన పోరాటం చేస్తాం, మానవత విలువలను కాపాడుతామని గొప్పలు చెప్పుకునే పత్రికా యజమాన్యాలు, ప్రజలను దోచుకుని పోలీసుల నుండి చాకచక్యంగా తప్పించుకుని తిరుగుతున్న సదరు ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన రిపోర్టర్ ను, ఆ యజమాన్యం పత్రిక నుండి తొలగించకపోవడంతో రోజురోజుకు పత్రిక విలువలు మంటగలుస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ యంత్రాంగం క్షున్నమైన విచారణ చేపట్టి సదరు ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన రిపోర్టర్ పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చలు నడుస్తున్నాయి.

# అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌పై అమెరికా, జర్మనీలు కామెంట్స్

## అంతర్గత విషయమన్న భారత్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం స్కామ్ కేసులో అరెస్ట్‌తో ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యవహారం గ్లోబల్ టాక్‌లా మారింది. ఈ కేసుపై మొన్న జర్మనీ, నిన్న అమెరికా స్పందించడం కలకలం రేపుతోంది. ఇది తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనంటూ భారత్ కన్నెర్ర చేసింది. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై అంతర్జాతీయ స్పందనలు దుమారం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో ఇతర దేశాలు జోక్యం చేసుకోవడం చర్చనీయాంశంగా మారుతోంది. మొన్నామధ్య జర్మనీ దీనిపై ప్రకటన విడుదల చేయగా, తాజాగా అమెరికా కూడా స్పందించింది. భారత్‌లోని ప్రతిపక్ష నేత అరెస్టుకు సంబంధించిన నివేదికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఈ కేసులో పారదర్శక విచారణను ప్రోత్సహిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. దీనిపై సీరియస్ అయిన భారత్ ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్తకు సమన్లు జారీ చేసింది. అమెరికా రాయబార కార్యాలయం తాత్కాలిక డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బెర్బెనా సౌత్ బ్లాక్‌లోని విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. అరగంట పాటు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దౌత్య సంబంధాల్లో దేశాలు ఇతరుల సార్వభౌమాధికారం, అంతర్గత వ్యవహారాలను గౌరవించాలని భావిస్తున్నామంటూ భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. భారత న్యాయ ప్రక్రియలు స్వతంత్ర న్యాయవ్యవస్థపై ఆధారపడి ఉంటాయని, ఇందులో కచ్చితమైన, సమయానుకూల ఫలితాలు వస్తాయని, అంచనాలు తగదని తేల్చి చెప్పింది. జర్మనీ విదేశాంగశాఖ కూడా ఇదే తరహాలో అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ న్యాయపరమైన, నిష్పాక్షికమైన విచారణకు అర్హుడని, అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను ఎలాంటి పరిమితులు లేకుండా ఆయన వినియోగించుకోవచ్చని ఆ ప్రకటనలో ఉంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్.. జర్మనీ రాయబారికి సమన్లు ఇచ్చింది. జర్మనీ ఎంబసీ డిప్యూటీ హెడ్ జార్జ్ ఎంజ్‌వీలర్ భారత విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జర్మనీ తీరు తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని భారత్ తేల్చి చెప్పింది. మద్యం పాలసీకి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 21న కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. తొలుత మార్చి 28 వరకు ఈడీ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. తన అరెస్ట్, రిమాండ్‌ను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్ట్ స్పందించింది. కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయలేమని తెలిపింది. ఏప్రిల్ 2 లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై ఏప్రిల్ 3కు విచారణను వాయిదా వేసింది.

# నెల్లూరు సీటీలో గెలిచోన్నళ్లదే బలమంతా

**నెల్లూరు :** ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ ఎంతో ప్రత్యేకమైనవి. జిల్లా వ్యాప్తంగా ఎవరు గెలిచినా, ఓడినా.. నగర నియోజకవర్గంలో గెలిచిన పార్టీకే పట్టు ఎక్కువగా ఉంటుంది. 2004 వరకు నెల్లూరు ఒకటే నియోజకవర్గం. 2009 నుంచి నెల్లూరు సిటీ, రూరల్ గా రెండు నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. రూరల్ నియోజకవర్గంలో కూడా సిటీలో ఉన్న కొన్ని డివిజన్లు కలుస్తాయి కానీ.. సిటీ నియోజకవర్గమే ఎక్కువగా వార్తల్లో ఉంటుంది. నెల్లూరు నియోజకవర్గం వామపక్షాలు మినహా అన్ని పార్టీలను ఆదరించింది. కాంగ్రెస్, టీడీపీ, భారతీయ జనసంఘ్, ప్రజారాజ్యం.. అన్ని పార్టీలకు ఇక్కడ ప్రాతినిధ్యం ఉంది. మొదట్లో ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఇక్కడ బోణీ కొట్టింది. మాజీ మంత్రి, ఏసీ సుబ్బారెడ్డిగా నెల్లూరు జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పిన ఆనం చెంచు సుబ్బారెడ్డి 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత కాల క్రమంలో ఆనం వెంకట రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, ఆనం వివేకానంద రెడ్డి కూడా నెల్లూరు సిటీ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు నెల్లూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పనిచేయడం విశేషం. అయితే ఇందులో ఆనం రామనారాయణ రెడ్డి మాత్రం టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు, మిగతా ముగ్గురు కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1967లో ఎం.ఆర్.అన్నదాత, భారతీయ జనసంఘ్ తరపున నెల్లూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో తాళ్లపాక రమేష్ రెడ్డి కూడా నెల్లూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడిగా తాళ్లపాక రమేష్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. ఆయనకు కూడా ఎన్టీఆర్ మంత్రి పదవి ఇచ్చారు. 2009లో నెల్లూరు సిటీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి ప్రజారాజ్యం తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014లో అనిల్ కుమార్ యాదవ్ వైఎస్సార్సీపీ తరపున ఎమ్మెల్యే అయ్యారు. 2019లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్.. జగన్ కేబినెట్ లో జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి నెల్లూరు నియోజకవర్గం అయినా, నెల్లూరు సిటీ అయినా.. మంత్రుల నియోజకవర్గంగా పేరుతెచ్చుకుంది. ఇక్కడ గెలిచిన వారికి కచ్చితంగా మంత్రి పదవి వరిస్తుందనే ప్రచారం ఉంది. ఏసీ సుబ్బారెడ్డి, ఆనం వెంకట రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి. తాళ్లపాక రమేష్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్.. ఇలా వీరంతా నెల్లూరు నుంచి గెలిచి మంత్రి పదవులు స్వీకరించినవారే. ప్రస్తుతం నెల్లూరు సిటీలో హోరాహోరీ పోరు నడుస్తోంది. నిన్న మొన్నటి వరకు అనిల్ కుమార్ యాదవ్ వైసీపీ తరపున పోటీ చేస్తారనుకున్నా.. ఆయన్ను నర్సరావు పేట ఎంపీ అభ్యర్థిగా పంపించిన సీఎం జగన్, ఇక్కడ ఖలీల్ అహ్మద్ ను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి దింపారు. టీడీపీ తరపున మాజీ మంత్రి నారాయణ గెలుపు తనదేనంటున్నారు. అనిల్ వర్సెస్ నారాయణ టఫ్ ఫైట్ ఉంటుందని అనుకున్నా.. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థి నారాయణ ముందు నిలబడలేరనే ప్రచారం ఉంది. కానీ నెల్లూరు సిటీ నియోజకవర్గానికి జిల్లా వైసీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరిశీలకులుగా ఉన్నారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి గెలుపు బాధ్యతలను ఆయనే భుజాన మోస్తున్నారు. ఈ నియోజకవర్గంలో నారాయణను ఓడించడం వైసీపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. ఒకవేళ నారాయణ గెలిచి టీడీపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా ఆయన చంద్రబాబు మంత్రి వర్గంలో ఉంటారు.

# పశువులకు బార్ కోడ్, చెవిపోగులు తప్పనిసరి

## - గాలికుంటు వ్యాధి టీకాల తనిఖీలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య

**వాస్తవ నేస్తం,అనంతగిరి:** మండల పరిధిలోని శాంతినగర్ గ్రామపంచాయితీలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. పశు పోషకులకు అత్యంత ఆర్ధిక నష్టం కల్గించే గాలికుంటు వ్యాధిని దేశంలో సమూలంగా నిర్మూలించడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమము జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లోనే టీకాలు వేయాలని,టీకా నిర్వహణ సమయములో కోల్డ్ చెయిన్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర మందుల కిట్ ని వెంట ఉంచుకోవాలని మండలములో నిర్ణీత షెడ్యూలు సమయములోనే టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



**పశువులకు బార్ కోడ్,చెవిపోగులు తప్పనిసరి..**

మనిషికి ఆధార్ నెంబర్ లాగా పశువులకి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన బార్ కోడ్ చెవిపోగులు ఇది వరకే వేయడం జరిగిందని ఇవి ఎల్లవేళలా ప్రతీ పశువుకి ఉండాలని, చెవిపోగులు ఊడిపోయిన పశువులకు, కొత్తగా పుట్టిన దూడలకు చెవిపోగులు వేసి అట్టి నెంబర్ ని భారత్ పశుధాన్ ఆప్ లో నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్ లో బార్ కోడ్ లేని పశువుల్ని కలిగి ఉన్నట్లయితే నేరం క్రింద పరిగణించే అవకాశాలు ఉంటాయని, చెవిపోగుల గల పశువుల వివరాలు మాత్రమే భారత ప్రభుత్వ ఆప్ లో అందుబాటులో ఉంటాయితప్ప పోగులు లేని పశువులు గణనలోకి రావు అని తెలిపారు. పశువుల ఆరోగ్య స్థితి, దాని వైద్యం యాజమాన్యానికి నిధులకేటాయింపునకై రైతులకి, ప్రభుత్వానికి ఎంతో ఉపయుక్తమైన ఈ చెవిపోగులను ప్రతీ పశువుకే వేయించుకోవడం పశుపోషకులు భాద్యతగా భావించాలని ఈ దిశగా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పశువైద్యంలో శాస్త్రీయ వ్యాధి నిర్ధారణకై మెడికల్ డిపార్ట్మెంట్ మాదిరి పశువైద్య శాఖలో సైతం ప్రాథమిక పశువైద్య కేంద్రాల్లో పశువుల రక్తం, పేడ, మరియు చర్మ నమూనాలు పరీక్షించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పశువైద్యశాలల్లో ఉన్న మైక్రోస్కోప్ ల ప్రస్తుత పనితీరును తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ తీన్మార్ మల్లన్న పోటీ

**కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలలో దాదాపు ఆయా పార్టీల సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ నుండి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ బరిలో దిగుతున్నారు. బీజేపీ నుంచి ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు, సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ పోటీ చేస్తున్నారు. దాంతో వీరిని ఢీకొట్టేందుకు కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి ఎవరు దిగనున్నారు అన్న విషయం కరీంనగర్‌లో ఉత్కంఠ రేపుతోంది.పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ స్థానంలో కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థిపై ఎటు తేల్చుకోలేకపోతుంది. ఈ క్రమంలో ముగ్గురు పేర్లను అధిష్టానం పరిశీలిస్తోంది. కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతి రావు కుమారుడు రాజేందర్ రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పోటీ పడుతున్నారు. ఐతే బీఆర్ఎస్, బీజేపీ నుంచి బలమైన అభ్యర్థులు ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానం తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) పేరును తెరపైకి చేచింది. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే ఎక్కువ ఉంటుంది. ఎంపీ టికెట్ వస్తే తీన్మార్ మల్లన్న ప్రచార ఖర్చులు భరించడానికి సిద్ధంగా ఉన్నారని పార్టీలో వినిపిస్తోంది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీకి ఈ తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. బీజేపీ అభ్యర్థి ఎంపీ బండి సంజయ్ కాపు సామాజికవర్గం కావడం అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో తీన్మార్ మల్లన్నను బరిలో నిలపాలని హస్తం పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థులుగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, వెలిచాల రాజేందర్ రావు పేర్లు ప్రచారంలో ఉండగా.. కొత్తగా మరొకరి పేరు పార్టీ శ్రేణుల్లో చక్కర్లు కొడుతుంది. క్యూ న్యూస్ జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేయడం దాదాపు ఖరారు అయినట్లు సమాచారం. తీన్మార్ మల్లన్న కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రచారం జోరందుకుంది. జర్నలిస్టుగా పలు సంస్థల్లో పనిచేసిన తీన్మార్ మల్లన్న గతంలో నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోవడం తెలిసిందే.కాంగ్రెస్ నుంచి



చివరగా పొన్నం ప్రభాకర్ 2009లో కరీంనగర్ ఎంపీగా గెలుపొందారు. అంతకుముందు కాంగ్రెస్ నేత 1984, 1989, 1991 లోక్ సభ ఎన్నికల్లో జువ్వాడి చొక్కారావు హ్యాట్రిక్ విజయాలు సాధించారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను పాతే దిశలో ప్రయత్నాలు జోరుగానే సాగుతున్నా

## బిజినెస్

# ఎస్‌బీఐ కార్డులు ఉపయోగిస్తున్నారా?

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ తమ ఖాతాదారులకు ఒక బ్యాడ్ న్యూస్ చెప్పింది. ఎస్‌బీఐ కార్డులపై ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏ బ్యాంక్ అయిన తమ ఖాతాదారులకు అందించే కార్డులపై ఛార్జీలు వసూలు చేస్తుందనే విషయం తెలిసిందే. ఈ ఛార్జీలను బ్యాంకులు ఏడాదికి ఒకసారి అకౌంట్ హెూల్డర్స్ నుంచి వసూలు చేస్తాయి. అయితే తాజాగా ఈ ఛార్జీలను పెంచుతూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకుంది.కొన్ని డెబిట్ కార్డులకు సంబంధించిన వార్షియ మెయింటెనెన్స్ ఛార్జీలను పెంచుతున్న ఎస్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. పెంచిన ఈ ఛార్జీలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందులో భాగంగా ఎస్‌బీఐ క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులపై ఛార్జీలను ఏకంగా రూ. 75 పెంచేసింది. ప్రస్తుతం ఈ కార్డులపై వార్షిక ఛార్జీ రూ. 125తో పాటు అదనంగా జీఎస్టీ ఉండగా ప్రస్తుతం దీనిని రూ. 200లతో పాటు జీఎస్టీకి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇక యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డ్, మై కార్డ్ (ఇమేజ్ కార్డ్) వాంటి వాటిపై ఏకంగా 50 శాతం మేర ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ కార్డులపై వార్షిక ఛార్జీలు రూ. 175ం జీఎస్టీగా ఉండగా, ప్రస్తుతం రూ. 250ం జీఎస్టీకి పెంచచారు. వీటితో పాటు ప్లాటినమ్ డెబిట్ కార్డు ఛార్జీలను కూడా పెంచేశారు. వీటిపై యాన్యువల్ ఛార్జీలను 30 శాతం పెంచారు. ప్రస్తుతం వీటిపై ఏడాదికి రూ. 250 ప్లస్ జీఎస్టీగా ఉండగా, రూ. 325కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎస్‌బీఐ ప్రైడ్ ప్రీమియమ్ బిజినెస్ డెబిట్ కార్డు వంటి వాటి ప్రీమియం కార్డుల ఛార్జీల్ని రూ. 350 ప్లస్ జీఎస్టీ నుంచి రూ. 425 ప్లస్ జీఎస్టీగా నిర్ణయించింది. ఇక్కడ జీఎస్టీ ప్రతి దాంట్లో 18 శాతంగా ఉంటుంది. ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయంతో యూజర్లపై భారం పడనుంది.




## పీఎఫ్‌తో అధికంగా పన్ను ఆదా చేసుకోవచ్చు




ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేయడానికి తుది గడువు సమీపిస్తోంది. మార్చి 31లోపు పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అందరూ పన్ను ఆదా చేసే పథకాల కోసం వెతుకుతుంటారు. చాలా పథకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ.. సంప్రదాయ పెట్టుబడి పథకం, ఉద్యోగులం దరికీ తప్పనిసరిగా ఉండే ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్) అధిక ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. నిజానికి ఈ పథకం ఉద్యోగులు పదవీవిరమణ కోసం ఉద్దేశించినది. అయినప్పటికీ ఇది పన్ను ఆదా చేయడంలో ఉద్యోగులకు సాయపడుతుంది. ఈ నేపత్యంలో దీనికి ఈపీఎఫ్ కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ అనేది పదవీ విరమణ కోసం అధిక మొత్తంలో నగదు సమకూర్చుకునేందుకు ఉపయోగపడే పథకం. ఇది 1952లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్ చట్టం రూపంలో అమలులోకి వచ్చింది. ప్రస్తుతం దీనిని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) నిర్వహిస్తోంది. ఈపీఎఫ్ పథకంలో, ఉద్యోగులు ప్రతి నెలా వారి ప్రాథమిక ఆదాయంలో 12% విరాళంగా అందించాలి. అలాగే వారి యజమాని ఈ మొత్తానికి సరిసమానంగా వారు ఖాతాలో జమచేస్తారు. మీరు పదవీ విరమణ చేసినప్పుడు, మీరు వడ్డీతో సహా మొత్తం మొత్తాన్ని ఒకేసారి అందుకుంటారు. ఈపీఎఫ్ చాలా తక్కువ-రిస్క్ పెట్టుబడిగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది భారత ప్రభుత్వంచే నిర్వహించబడుతుంది. ఇది స్థిరమైన రాబడికి హామీ ఇస్తుంది. యజమాని సహకారంలో దాదాపు 8.33% ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్)కి కేటాయిస్తారు. ఉదాహరణకు, మీ నెలవారీ ప్రాథమిక జీతం రూ. 1,00,000 అయితే మీరు ఈపీఎఫ్ కి చెల్లించే కాంట్రిబ్యూషన్ రూ. 12,000 (మీ ప్రాథమిక జీతంలో 12%). దీని నుంచి మీరు పన్ను ఆదా చేసుకోవచ్చు. అదెలా అంటే మీరు సెక్షన్ 80సీ కింద సంవత్సరానికి రూ. 1,44,000 (12 %ఞ% రూ. 12,000) తగ్గింపును క్లెయిమ్ చేయవచ్చు. తద్వారా ఈపీఎఫ్ సభ్యులకు ఆధారపడదగిన రిటైర్మెంట్ ఫండ్ మూలాన్ని అందించడమే కాకుండా, పన్ను ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అదే విధంగా సెక్షన్ 80సీ కిందే దీనిలో వచ్చే వడ్డీని కూడా పన్ను రహితంగా పొందొచ్చు. రూ. 1,50,000 వరకూ పన్ను రహిత వడ్డీని పొందొచ్చు.

## పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్!

**న్యూఢిల్లీ:** బజాజ్ ఫైనాన్స్‌లో ఓ విభాగంగా ఉన్న బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్.. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కంపెనీ తన విలువను సుమారు 9-10 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.75,000-83,000 కోట్లు)గా అంచనా వేసుకుంటూ, అందుకనుగుణంగా వాటాల విక్రయం ద్వారా నిధులు సమీకరించాలని భావిస్తోందని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం పలు దేశీయ, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. రూ.7500 కోట్ల సమీకరణ లక్ష్యం?: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో 'అప్పర్ లేయర్' కింద గుర్తింపు పొందిన సంస్థలు.. వాటిని నోటిఫై చేసిన తేదీ నుంచి మూడేళ్లలోగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలన్నది ఆర్‌బీఐ నిబంధన. 16 ఎన్‌బీఎఫ్‌సీలతో అప్పర్‌లేయర్ జాబితాను ఆర్‌బీఐ 2022 సెప్టెంబరు 30న విడుదల చేసింది. ఇందులో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు టాటా సన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, టాటా కేపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లాంటివి ఉన్నాయి.

## ఫేస్‌బుక్‌పై సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ: మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని ఫేస్‌బుక్‌పై సంచలన ఆరోపణలకు సంబంధిచిన పత్రాలు బయటకొచ్చా యి. స్నాప్‌చాట్, యూట్యూబ్, అమెజాన్ వంటి ప్రత్యర్థి ప్లాట్‌ఫామ్‌ల యూజర్లపై ఫేస్‌బుక్ స్నూపింగ్ (అనైతిక విశ్లేషణ) చేసినట్లు ఆరోపిస్తూ కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టు కొత్త పత్రాలను విడుదల చేసింది. 'టెక్ క్రంచ్' కథనం ప్రకారం.. స్నాప్‌చాట్ యాప్‌కి, తమ సర్వర్‌లకు మధ్య నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను అడ్డగించడానికి, డీక్రిప్ట్ చేయడానికి ఫేస్‌బుక్ 2016లో 'ప్రాజెక్ట్ ఘోస్ట్‌బస్టర్స్' అనే రహస్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. కోర్టు పత్రాల ప్రకారం.. యూజర్ బిహేవియర్‌ను అర్థం చేసుకోవడానికి, స్నాప్‌చాట్‌పై ప్రయోజ నాన్ని పొందేందుకు ఫేస్‌బుక్ ఈ చొరవను రూపొందించింది. ఈ పత్రాల్లో రహస్య ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించిన ఫేస్‌బుక్ అంతర్గత ఈమెయిల్‌లు కూడా ఉన్నాయి. 2016 జూన్ 9 నాటి అంతర్గత ఈమెయిల్‌లో ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ స్నాప్‌చాట్‌లో ఎన్‌క్రిప్టెడ్ ట్రాఫిక్ ఉన్నప్పటికీ దానిలో విశ్లేషణలను పొందాలని ఉద్యోగులను ఆదేశించి నట్లుగా ఉంది. దీంతో నిర్దిష్ట సబ్‌డొమైన్‌ల ట్రాఫిక్‌కు అంతరా యం కలిగించడానికి 2013లో ఫేస్‌బుక్ ద్వారా పొందిన వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ 'ఒనావో'ను ఉపయోగించాలని ఫేస్‌బుక్ ఇంజనీర్లు ప్రతిపాదించారు. ఒక నెల తర్వాత, వారు ఐవోఎస్, ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫారమ్‌లలో ఇన్‌స్టాల్ చేయగల ప్రతిపాదన కిట్‌లను అందించారు. ఈ ప్రాజెక్ట్‌ను అమెజాన్, యూట్యూబ్ యూజర్ల డేటా కోసం విస్తరించారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల బృందంతో పాటు దాదాపు 41 మంది న్యాయవాదులు ప్రాజెక్ట్ ఘోస్ట్‌బస్టర్స్‌లో పనిచేశారు. ఒనావోను ఉపయోగించడానికి ఫేస్‌బుక్ టీనేజర్‌లకు రహస్యంగా డబ్బు చెల్లిస్తోందని దర్యాప్తులో వెల్లడైన తర్వాత, ఫేస్‌బుక్ 2019లో ఒనావోను మూసివేసింది.

## ఐకార్-ఐఐఆర్ఆర్‌కు రూ.4.5 కోట్ల మద్దతు

**హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)ను కొనసాగిస్తోంది. బుధవారం హైదరాబాద్‌కు అధికారిక పర్యాటనకు వచ్చిన ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ) చల్లా శ్రీనివాసులు శెట్టి పలు కార్యక్రమాల్లో పాల్గన్నారు. కోటిలోని లోకల్ హెడ్ ఆఫీసులో ఐకార్‌ఐఐఆర్‌ఆర్‌తో జరిగిన ఎస్‌బిఐ ఫౌండేషన్ ఒప్పందానికి హాజరయ్యారు. సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించే 'మంచికళలు' ఎన్‌జిఒకు టాటా వింగర్ మినిబస్‌ను అందించారు. మంచికళలు ఫౌండర్ ప్రెసిడెంట్ శరత్ కుమార్ పుప్పలకు వాహన తాళం చెవులను బహుకరించారు."శరత్ కుమార్ సేవలు ప్రశంసనీయం. కార్పొరేట్ సామాజిక సేవ కోసం చెక్కులు రాయడం సులభమే.. కానీ సరైనా ఎన్‌జిఒను గుర్తించి సాయం చేయడమే క్లిష్టమైన అంశం. ఎస్‌బిఐ ఫౌండేషన్ ద్వారా అడవి ప్రాంతాల్లోని 112 జిల్లాల్లో మొబైల్ హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలనేది మా సంకల్పం." అని సిఎస్ శెట్టి అన్నారు. ఐకార్-ఐఐఆర్‌ఆర్‌కు ప్రొమోషన్ ఆఫ్ డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్ఆర్) కోసం ఏకంగా రూ.4.5 కోట్ల విలువ చేసే చెక్కును ఆయన అందజేశారు.

## స్పోర్ట్స్

# విహారికి షోకాజ్ నోటీస్.. కెప్టెన్సీ కోల్పోయాక ఇదే ఫస్ట్



క్రికెటర్ హనుమా విహారి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. క్రికెట్ అసోసియేషన్ తాజాగా విహారికి షోకాజ్ నోటీస్ పంపింది. అర్థాంతరంగా కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో పాటు భవిష్యత్‌లో ఆంధ్రాకు ఆడనని చెప్పడానికి కారణం ఏంటో చెప్పాలని ఆదేశించింది. ఈ విషయాన్ని మరింత పెద్దది చేయకూడదని ఏసీఏ భావిస్తోందని ఏసీఏ అధికారి ఒకరు తెలిపారు. 'గత నెలలో విహారి ఎందుకు అలాంటి కామెంట్స్ చేశాడో తెలుసుకోవాలి అనుకుంటున్నాం. ఇప్పటివరకూ అతడు మమ్మల్ని కాంటాక్ట్ కాలేదు. అతడు ఏమైనా చెప్పదలచుకునేందుకు ఇదొక మంచి అవకాశం. ఆంధ్రా క్రికెట్‌కు విహారి చేసిన సేవను మేము గుర్తిస్తున్నాం. అతడు దేశవాళీలో పలు స్థానాల్లో ఆడాడు' అని సదరు అధికారి చెప్పాడు. ఆస్ట్రేలియాలో 2021-22లో భారత జట్టు టెస్టు సిరీస్ నెగ్గడంలో విహారి కీలక పాత్ర పోషించాడు. అయితే.. గాయం కారణంగా ఆ తర్వాత జట్టుకు దూరమయ్యాడు. అయితే.. దేశవాళీలో ఆంధ్రా క్రికెట్ జట్టు తరఫున సంచలన ప్రదర్శన చేశాడు. కానీ, అనూహ్య పరిస్థితుల్లో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అంతేకాదు భవిష్యత్‌లో ఆంధ్రా జట్టుకు ఆడనని వెల్లడించాడు. ' ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నన్ను ఎంతో వేధనకు గురి చేసింది. నా ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసింది. ఓ రాజకీయ నాయకుడి కుమారుడి కోసం నన్ను బలి చేశారు' అని విహారి తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దాంతో, ఆంధ్రా క్రికెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. రంజీ ట్రోఫీ 2023-24 క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రా జట్టు ఓడిపోయింది. మధ్యప్రదేశ్ చేతిలో 4 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈమ్యాచ్ అనంతరం విహారి తాను ఆంధ్రా జట్టును వీడుతున్నట్టు పోస్ట్ పెట్టాడు. రాజకీయ బలమున్న పృథ్వీ రాజ్‌కు వత్తాసు పలికి తనను కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారని ఆదేదనకు గురయ్యాడు. విహారి ఆంధ్రా తరఫున 37 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అంతకంటే ముందు అతడు హైదరాబాద్‌కు ఒక సీజన్ మొత్తం ప్రాతినిధ్యం వహించాడు.

## ఐపీఎల్‌లో టాప్-2 స్కోర్లు.. కామన్‌గా ఒకే ఆటగాడు!



ఐపీఎల్ 2024లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో 277 పరుగులు చేసిన సన్‌రైజర్స్.. లీగ్ చరిత్రలోనే అత్యధిక టీమ్ స్కోర్‌ను నమోదు చేసిన విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ ఈ రికార్డును నెలకొల్పే క్రమంలో ఆర్సీబీ పేరిట ఉండిన పాత రికార్డును బద్దలు కొట్టింది. 11 ఏళ్ల కిందట 2013 సీజన్‌లో ఆర్సీబీ.. పూణే వారియర్స్‌పై చేసిన 263 పరుగులే నిన్నటి మ్యాచ్‌కు ముందు వరకు ఐపీఎల్‌లో అత్యధిక టీమ్ స్కోర్‌గా ఉండింది. ఐపీఎల్‌లో టాప్-2 స్కోర్‌లు నమోదైన సందర్భాల్లో ఓ ఆటగాడు కామన్‌గా ఉండటం అందరి దృష్టిని ఆకర్శిస్తుంది. ప్రస్తుత సన్‌రైజర్స్ ఆటగాడు జయదేవ్ ఉనద్కత్ 2013లో ఆర్సీబీతో.. ప్రస్తుతం సన్‌రైజర్స్‌లో ఉన్నాడు. ఈ విషయం గురించి తెలిసి నెటిజన్లు ఉనద్కత్‌ను లక్కీ లెగ్‌గా పరిగణిస్తున్నారు. భారీ స్కోర్లు నమోదు కావాలంటే ఉనద్కత్ ఉండాల్సిందేనంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయమేమిటంటే.. రెండు మ్యాచ్‌ల్లో ఉనద్కత్ ప్రత్యర్థులపై రెండేసి వికెట్లు పడగొట్టాడు. ఇదిలా ఉంటే, ముంబై ఇండియన్స్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ (24 బంతుల్లో 62బీ 9 ఫోర్లు, 3 సిక్సర్లు), అభిషేక్ శర్మ (23 బంతుల్లో 63బీ 3 ఫోర్లు, 7 సిక్సర్లు), క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్‌బీ 4 ఫోర్లు, 7 సిక్సర్లు), మార్క్రమ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సర్ సాయంతో 42 నాటౌట్) విధ్వంసం సృష్టించడంతో సన్‌రైజర్స్ 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆరెంజ్ ఆర్మీ.. నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేయగా.. ఛేదనలో ముంబై నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసి లక్ష్యానికి 32 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 34బీ 2 ఫోర్లు, 4 సిక్సర్లు), రోహిత్ శర్మ (12 బంతుల్లో 26బీ ఫోర్, 2 సిక్సర్లు), నమన్ ధిర్ (14 బంతుల్లో 30బీ 2 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (34 బంతుల్లో 64బీ 2 ఫోర్లు, 6 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 42 నాటౌట్‌బీ 2 ఫోర్లు, 3 సిక్సర్లు) సన్‌రైజర్స్‌కు దడ పుట్టించారు.

## చెత్త కెప్టెన్సీ.. హార్దిక్‌పై మాజీ పేసర్ల విమర్శలు



క్వెనా మఫాకా నాలుగు ఓవర్లలో 66 పరుగులు- నో వికెట్.. హార్దిక్ పాండ్యా నాలుగు ఓవర్లలో 46 రన్స్- ఒక వికెట్.. గెరాల్డ్ కోయెట్జి నాలుగు ఓవర్లలో 57 పరుగులు- ఒక వికెట్... పీయూశ్ చావ్లా రెండు ఓవర్లలో 34 పరుగులు- ఒక వికెట్.. షామ్స్ ములానీ రెండు ఓవర్లు 33 పరుగులు- నో వికెట్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం నాటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్ల ప్రదర్శన ఇది. ఈ మ్యాచ్‌లో కాస్త మెరుగ్గా బౌలింగ్ చేసింది ఎవరైనా ఉన్నారంటే.. ముంబై ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే.. తన నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసిన ఈ ఫాస్ట్‌బౌలర్ 36 పరుగులతో సరిపెట్టాడు. మ్యాచ్ ఫలితాన్ని పక్కనపెడితే.. పరుగుల వరద పారుతున్న పిచ్‌పై తన అనుభవం, నైపుణ్యాలు ఏమిటో బుమ్రా మరోసారి నిరూపించుకున్నాడు. మరోవైపు.. బుమ్రాను కాదని అనామక బౌలర్‌తో ఫస్ట్ ఓవర్ వేయించిన కెప్టెన్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనామక బౌలర్‌తో అటాక్‌ను ఆరంభించడం పట్ల ఇర్ఫాన్ పఠాన్, బ్రెట్ లీ వంటి మాజీ పేసర్లు హార్దిక్ పాండ్యాపై మండిపడ్డారు. ఐపీఎల్ ఎక్స్‌పర్ట్ బ్రెట్ లీ జియో సినిమా షోలో మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రాతో తొలి ఓవర్ వేయించకుండా ముంబై ఇండియన్స్ మరోసారి తప్పుచేసింది. గత మ్యాచ్‌లోనూ ఇలాగే చేశారు. బుమ్రాను ఆరంభంలోనే బరిలోకి దింపితే మ్యాచ్ మరోలా ఉండేది" అని అభిప్రాయపడ్డాడు. మరోవైపు.. ఇర్ఫాన్ పఠాన్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో పాండ్యా కెప్టెన్సీ అత్యంత సాధారణంగా ఉంది. బుమ్రాను ఆలస్యంగా తీసుకువరావడం ఎవరి ఊహకు అందనది. ఇక లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ బ్యాటర్లంతా 200 స్ట్రైక్‌రేటుతో ఆడుతుంటే.. కెప్టెన్ మాత్రం 120 స్ట్రైక్‌రేటుతో ఆడటం ఏమిటో?" అంటూ పాండ్యా ఆట తీరు, కెప్టెన్సీపై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. కాగా ఉప్పల్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై.. సన్‌రైజర్స్ చేతిలో 31 పరుగులతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పాండ్యా ఒక వికెట్ తీయడంతో పాటు.. 20 బంతుల్లో 24 పరుగులు చేశాడు.



# స్వామి ఉన్నదాన్ని మాత్రం చెడగొట్టకు..

## విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ ట్రైలర్

గీత గోవిందం సినిమా తర్వాత విజయ్ దేవరకొండ  నుంచి వస్తున్న పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫ్యామిలీ స్టార్  గీతగోవిందం ఫేం పరశురాం డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో మరాఠీ భామ మృణాళ్ ఠాకూర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఇటీవలే హోలీ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈ చిత్రం నుంచి థర్డ్ సాంగ్ మధురం కదాను విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 5న థియేటర్లలో సందడి చేయనుండటంతో ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు మేకర్స్. ఇందులో భాగంగా ఫ్యామిలీ స్టార్ ట్రైలర్‌ను లాంఛ్ చేశారు. స్వామి నా జీవితంలో కొత్తగా బ్రేకులు ఇవ్వకున్నా పర్వాలేదు..కానీ ఉన్నదాన్ని మాత్రం చెడగొట్టకు.. అంటూ విజయ్ దేవరకొండ స్టైల్ డైలాగ్స్‌తో షురూ అయింది ట్రైలర్. ఫ్యామిలీ స్టార్ కుటుంబం చుట్టూ తిరిగే ఫన్ అండ్ సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా వినోదాత్మకంగా సాగనున్నట్టు ట్రైలర్ చెబుతోంది. పరశురాం మరోసారి తన మార్క్‌ను సినిమాలో పర్‌ఫెక్ట్‌గా చూపించబోతున్నట్టు చెప్పకనే చెబుతోంది. లైన్‌లో నిలబడి ఉల్లిపాయలు తేవడం.. టైంకు లేచి పిల్లలను రెడీ చేసి స్కూల్ పంపించడమనుకున్నావా.. సెటిల్‌మెంట్ అంటే..? అంటే అని అజయ్ ఘోష్ అంటుంటే.. భలే మాట్లాడతారన్నా మీరంతా.. ఏ ఉల్లిపాయలు లైన్‌లో నిలబడి కొంటే వాడు మనిషి కాదా..పిల్లలను రెడీ చేస్తే వాడు మగాడు కాదా.. ఐరనే వంచాలా ఏంటీ.. కొబ్బరికాయ తేవడం మర్చిపోయా.. తలకాయ కొట్టేశా అంటూ ఫ్యామిలీ స్టార్ గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ మ్యాన్లీ లుక్‌లో క్లాసీగా చెబుతున్న మాస్ డైలాగ్స్ క్లాస్, మాస్ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాయి. ఫ్యామిలీ స్టార్ పాపులర్ డిజిటల్ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కాబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అమెజాన్ ప్రైమ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ, మృణాళ్ ఠాకూర్, నిర్మాత దిల్ రాజు అండ్ టీం దిగిన సూపర్ స్టైలిష్ స్టిల్స్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఫ్యామిలీ స్టార్ టైటిల్ లుక్, గ్లింప్స్, టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. మరోవైపు మధురం కదా సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో విజయ్, మృణాళ్ ఇద్దరూ వైట్ అండ్ వైట్ డ్రెస్‌లో డ్యాన్స్ చేసిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది.



# అందుకే బాలీవుడ్ వద్దనుకున్నా

ప్రస్తుతం దక్షిణాదిలో లక్కీయెస్ట్ హీరోయిన్ ఎవరంటే అందరూ త్రిష పేరునే చెబుతున్నారు. ఇక కెరీర్ ముగిసిపోయింది అనుకుంటున్న తరుణంలో ఈ భామ ఒక్కసారిగా తారాపథంలో దూసుకువచ్చింది.'పొన్నియన్ సెల్వన్' చిత్రంతో సక్సెస్‌ఫుల్ సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టింది. ప్రస్తుతం ఈ భామ చేతిలో పలు భారీ చిత్రాలున్నాయి. దక్షిణాదిలో అగ్ర నాయికలందరూ ప్రస్తుతం బాలీవుడ్‌లో కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.హిందీలో కూడా ఈ అమ్మడికి అవకాశాలొస్తున్నాయని చెబుతున్నారు. ఇదే విషయమై త్రిష స్పందిస్తూ "కట్టామిఠా' (2010) చిత్రంతో హిందీలో అడుగుపెట్టాను. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆ సినిమా ఫెయిల్యూర్ వల్లే నాకు బాలీవుడ్‌లో అవకాశాలు రాలేదని చాలా మంది అనుకున్నారు. అందులో నిజం లేదు. ఆ సమయంలో నా కుటుంబాన్ని ముంబయికి మార్చడానికి మనసు ఒప్పుకోలేదు. బాలీవుడ్‌కు వెళితే ఇక్కడ చాలా సినిమాలను వదులుకోవాల్సి ఉంటుంది. అప్పుడు దక్షిణాదిలో నాకున్న క్రేజ్ దృష్ట్యా బాలీవుడ్ సినిమాలు వొద్దనుకున్నాను' అని చెప్పింది త్రిష. ప్రస్తుతం ఈ భామ కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్', చిరంజీవి 'విశ్వంభర', అజిత్ 'విడాముయర్చి' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.

# తమిళ సినిమాల్లో కూడా నటిస్తా!



తెలుగులో ఫుల్ క్రేజ్ కలిగిన యువ నటిమనులలో శ్రీ లీల ఒకరు. శ్రీకాంత్ కుమారుడు అయినటువంటి రోషన్ హీరో గా రూపొందిన పెళ్లి సందడి అనే సినిమాతో ఈ బ్యూటీ తెలుగు తెరకు పరిచయం అయింది.ఈ మూవీ బాక్స్ ఆఫీస్ దగ్గర యావరేజ్ విజయాన్ని అందుకున్నప్పటికీ ఇందులో ఈ నటి తన నటనతో , అందాలతో , డ్యాన్స్ తో ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడంతో ఆ తర్వాత నుండి ఈమెకు వరసగా తెలుగు సినిమాలలో అవకాశాలు దక్కుతున్నాయి. అందులో భాగంగా ఇప్పటి వరకు అనేక సినిమాలలో నటించిన శ్రీ లీల తన క్రేజ్ ను టాలీవుడ్ ఇండస్ట్రీ లో మరింత గా పెంచుకుంది. ఇకపోతే ప్రస్తుతం ఈ ముద్దు గుమ్మ చేతిలో అనేక క్రేజీ సినిమాలు ఉన్నాయి. ఆఖరుగా ఈ నటి ఈ సంవత్సరం సంక్రాంతి పండగ కానుకగా జనవరి 12 వ తేదీన విడుదల అయినటువంటి గుంటూరు కారం అనే మూవీ తో ప్రేక్షకులను పలకరించింది. మహేష్ బాబు హీరో గా రూపొందిన ఈ సినిమాకు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించాడు. ఈ మూవీ యావరేజ్ విజయాన్ని అందుకుంది. ఇకపోతే ప్రస్తుతం కూడా ఈ ముద్దు గుమ్మ చేతిలో అనేక సినిమాలు ఉన్నాయి. ఇప్పటి వరకు శ్రీ లీల అనేక తెలుగు , కన్నడ సినిమాలలో నటించింది. కాకపోతే తమిళ సినిమాలో మాత్రం నటించలేదు.

# ఆ రెండు హిట్టయితే జాన్వీని ఇక ఆపలేరు?



టాప్ హీరోయిన్శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా వరుస సినిమాలను టాలీవుడ్ లో చేసేందుకు రెడీ అవుతుంది. బాలీవుడ్ లో ట్రై చేసినా అక్కడ ఆమెకు అంత గుర్తింపు అయితే రాలేదు. అందుకే తన తల్లి గడ్డ అయిన తెలుగు ఇండస్ట్రీలో ప్రస్తుతం భారీ సినిమాలు చేస్తుంది.ఇప్పటికే జాన్వీ ఎన్టీఆర్ తో దేవర సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే.కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా పై జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకుని ఫస్ట్ హిట్ కోసం ఎదురు చూస్తుంది. అలాగే మరో వైపు రామ్ చరణ్ కు జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో జాన్వీ కపూర్ ఓ సినిమా చేస్తుంది. ఇటీవలే ఆ సినిమా పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. అందులో జాన్వీ కపూర్ పాల్గొనడం జరిగింది. తెలుగు లో రెండు సినిమాల్లో నటించడంతో పాటు మరో స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ కూడా చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే దేవర సినిమా షూటింగ్ లో పాల్గొన్న జాన్వీ కపూర్ మళ్లీ ఎప్పుడెప్పుడు ఎన్టీఆర్ తో కలిసి సెట్స్ లో అడుగు పెడతామా అంటూ ఎదురు చూస్తున్నట్లు ఆమె పేర్కొంది. దేవరలో మళ్లీ తన పాత్ర షూటింగ్ కోసం ఇక ఏమాత్రం వేచి ఉండలేక పోతున్నాను అంటూ తన ఇన్ స్టాలో పేర్కొంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో కలిసి జాన్వీ కపూర్ చేస్తున్న దేవర సినిమా అక్టోబర్ నెలలో విడుదల అవ్వబోతుంది. దేవర సినిమా రెండు పార్ట్ లుగా రాబోతున్న విషయం తెల్సిందే. మొదటి పార్ట్ అక్టోబర్ నెలలో విడుదల అవ్వనుండగా, రెండో పార్ట్ 2025 చివర్లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక రామ్ చరణ్ తో జాన్వీ కపూర్ చేసే సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ సమ్మర్ లోనే ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలుస్తున్న సమాచారం ప్రకారం రెండు సినిమాల్లో కూడా జాన్వీ కపూర్ ను అందమైన పల్లెటూరు అమ్మాయిగా చూడబోతున్నాం.



# జిగర్ తండా దర్శకుడితో సూర్య కొత్త సినిమా

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శివ దర్శకత్వంలో కంగువ సినిమా చేస్తున్న ఈ చిత్రం అనంతరం ఆకాశం నీ హద్దురా ఫేమ్ సుధా కొంగరతో సూర్య43 చేయబోతున్నాడు. అయితే ఈ రెండు సినిమాలు షూటింగ్‌లో ఉండగానే సూర్య మరో స్టార్ దర్శకుడితో సినిమా ప్లాన్ చేస్తున్నాడు. ఇంతకి ఆ దర్శకుడు ఎవరో కాదు జిగర్ తండా డబుల్ ఎక్స్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న తమిళ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు. సూర్య తన తదుపరి ప్రాజెక్ట్ కార్తీక్ సుబ్బరాజుతో చేస్తున్నాడు. దీనికి సంబంధించి అధికారిక ప్రకటనను కార్తీక్ సుబ్బరాజు పోస్టర్ ద్వారా ఎక్స్ వేదికగా ప్రకటించాడు. సూర్య44 రానున్న ఈ ప్రాజెక్ట్ సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇక ఈ సినిమాను సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL 00067, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com